RNI No :TGTEL/26/A3993

గాయత్రి న్యూస్

తెలంగాణ



ప్రచురణ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా - తెలంగాణ శుక్రవారం 13-11-2026 సంపుటి : 1 సంచిక 169 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 8 వెల రు : 2/-

ప్రమాదం ఏ రూపంలోనైనా రావొచ్చు..

ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి



- యుద్ధాల తీరు మారుతోంది.. కొత్త ముప్పులపై అప్రమత్తంగా ఉండాలి.
- ఆకస్మిక దాడులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి.
- శత్రువులకు కోలుకునే సమయం ఇవ్వని సామర్థ్యాలు పెంచుకోవాలి.

2లో

ప్రైస్ రిలీఫ్‌లు పోయాయ్..

ఇప్పుడంతా ఇన్‌స్టా రీల్స్

మీడియాతో తనకు సుదీర్ఘ అనుబంధముందని మోదీ వెల్లడి.

- జర్నలిజంలో సాంకేతికంగా ఎన్నో మార్పులు.
- ఒకప్పుడు ఓబీ వ్యాన్లు.. ఇప్పుడు మొబైల్ ఫోన్లే వేదికలు.
- గతంలో ప్రెస్ రిలీజ్‌లు.. ఇప్పుడు ఇన్‌స్టా రీల్స్.
- గత 12 ఏళ్లలో 50 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం.
- విజయవంతమైన భారతీయుల కథనాలను ప్రపంచానికి చాటాలి.
- మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించాలని జర్నలిస్టులకు సూచన.



మీడియాతో తనకు సుదీర్ఘ కాలంగా అనుబంధం ఉందన్నారు ప్రధాని మోదీ. మీడియా ప్రపంచంలో సాధ్యం కానిదంటూ ఏదీ లేదన్నారు. విపత్తులు, సంక్షోభాల సమయంలో క్షేత్రస్థాయిలో పనిచేసే రిపోర్టరులు కథనాల కోసం ఎంతదూరమైనా వెళ్తారని ప్రధాని ప్రశంసించారు. దిల్లీలోని భాజపా ప్రధాన కార్యాలయంలో జర్నలిస్టుల కోసం దీపావళి మిలన్ పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మోదీ ప్రసంగించారు.

2లో

అడవిలో బుల్లెట్ గాయాలతో పోలీసుల మృతదేహాలు..



- కిశ్త్వాడ్ జిల్లాలో ఇద్దరు స్పెషల్ పోలీసు ఆఫీసర్లు మృతి.
- విధుల్లో ఉండగా అదృశ్యమైన బాబీ చాంద్, రశ్‌పాల్ కుమార్.
- అటవీ ప్రాంతంలో బుల్లెట్ గాయాలతో మృతదేహాల గుర్తింపు.
- ఘటనాస్థలంలో వారి సర్వీసు తుపాకులు

2లో

నమ్మకమైన వ్యాపార భాగస్వామి ఉంటే విజయాలు తథ్యం



విశాఖపట్నం: నమ్మకమైన వ్యాపార భాగస్వామి ఉంటే విజయాలు తథ్యమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. తన నాయకత్వంలో 8 సీఐఐ భాగస్వామ్య సదస్సులు జరిగాయని.. తనపై నమ్మకంతో ఎందరో పెట్టుబడులకు ముందుకొచ్చారని చెప్పారు. విశాఖలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఆయన మాట్లాడారు.

- రూ.22.6 లక్షల కోట్లతో 714 పెట్టుబడి ఒప్పందాలు.
- రూ.7.3 లక్షల కోట్ల విలువైన 303 ప్రాజెక్టులు గ్రౌండింగ్.
- పెట్టుబడుల భద్రతకు ప్రత్యేక చట్టం తేవాలని ప్రతిపాదన.
- ఏపీకి 160 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ లక్ష్యం.
- అమరావతిని బ్లూ గ్రీన్ సిటీగా అభివృద్ధి చేస్తాం.

2లో

కూకట్‌పల్లిలో ప్లాట్లకు భారీ ధర..

గజం రూ.2.18 లక్షలు



గజం రూ.2.18 లక్షలు
11 ప్లాట్లతో రూ.33 కోట్ల ఆదాయం
మరో 11 ప్లాట్లకు స్పందన కరవు

2లో

చంద్రబాబు పాలసీ ఆంత్రప్రెన్యూర్స్ కాదు.. ఆంధ్రా ప్రెన్యూర్స్:



2లో

సజ్జనర్ బదిలీ..

హైదరాబాద్ సీపీగా మహేశ్ భగవత్



- హైదరాబాద్ సీపీగా మహేశ్ భగవత్ నియామకం.
- ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్ డీజీగా సజ్జనార్ బదిలీ.
- ఆర్టీసీ ఎండీగా అనిల్ కుమార్.
- జైళ్లశాఖ డీజీగా స్వాతి లక్రా.
- ఉమెన్ సేఫ్టీ వింగ్ డీజీగా సౌమ్య మిశ్రా.
- ఏసీబీ డీజీగా చారు సిన్హా
- గ్రేహౌండ్స్, ఆక్టోపస్ డీజీగా విక్రమ్ సింగ్ మాన్.

- స్టీఫెన్ రవీంద్రకు ట్రాఫిక్, రోడ్, రైల్ సేఫ్టీ బాధ్యతలు.

హైదరాబాద్: రాష్ట్రంలో 21 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ సీపీగా ఉన్న సజ్జనర్ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్ డీజీగా బదిలీ అయ్యారు. ఎస్పీఎఫ్ డీజీగా ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. సజ్జనర్ స్థానంలో హైదరాబాద్ సీపీగా మహేశ్ భగవత్ నియమితులయ్యారు. ఆర్టీసీ వైస్ చైర్మన్, ఎండీగా అనిల్ కుమార్, జైళ్లశాఖ డీజీగా స్వాతి లక్రా, ఉమెన్ సేఫ్టీ వింగ్ డీజీగా సౌమ్య మిశ్రా, పౌరసరఫరాలశాఖ కమిషనర్‌గా నాగిరెడ్డి, ఏసీబీ డీజీగా చారు సిన్హా, ట్రైనింగ్ అదనపు డీజీగా సంజయ్‌కుమార్ జైన్, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ డీజీగా విక్రమ్ సింగ్ మాన్, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్, రైల్ సేఫ్టీ బ్యూరో డైరెక్టర్‌గా స్టీఫెన్ రవీంద్ర, అదనపు డీజీ (లా అండ్ ఆర్డర్)గా అకున్ సబర్వాల్,

2లో

జాతీయ రహదారిపై కారు దగ్ధం.. రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్



2లో

అక్రమంగా మహిళల అండాల సేకరణ..

పోలీసు కస్టడీకి నిందితులు



- ఐవీఎఫ్ కేంద్రాలు, వైద్య సంస్థలతో సంబంధాలపై ఆరా.
- ఆర్థిక లావాదేవీలపైనా దర్యాప్తు.
- సికింద్రాబాద్, మల్కాజిగిరిలో 8 ఐవీఎఫ్ కేంద్రాల్లో సోదాలు.
- ఇతర రాష్ట్రాల మహిళలకు డబ్బు ఆశ చూపి అక్రమంగా అండాల సేకరణ.

2లో

సంపాదకీయం

ఈసీఐ నేరం ఒప్పుకొన్నా న్యాయం జరిగేనా?

ఓటర్ మహాశయులకు, ముఖ్యంగా ఓటర్ జాబితాల నుంచి పేర్ల తొలగింపు బాధితులకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) దీపావళి కానుక నొకదాన్ని ఇచ్చింది. పండుగకు రెండు రోజుల ముందు జారీ చేసిన ఆదేశంలో-- సర్ ప్రక్రియ అమలు ఇంకా అధికారికంగా పూర్తికాని ఏడు రాష్ట్రాలలోని ఓటర్లకు రాయితీలు కల్పించింది. తద్వారా సర్ వ్యతిరేక ఉద్యమకారులు చేస్తున్న విధానపరమైన డిమాండ్లలో చాలావాటిని ఈసీఐ అంగీకరించింది. సమస్యేమిటంటే ఓటర్ జాబితాల నుంచి పేర్ల తొలగింపునకు గురైన ఓటర్లలో కొద్దిమందికి మినహా అందరికీ దీపావళి డిస్కౌంట్ వోచర్ గడువు ముగిసిపోయింది. నిజం చెప్పాలంటే ఈసీఐ ఆదేశం తన నేరాన్ని అంగీకరించడమే. సర్ పేరిట ఓటర్ జాబితాల నుంచి కోట్లాది ఓటర్ల పేర్లను న్యాయవిరుద్ధంగా తొలగించడమే ఆ అపరాధం. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలు బహిర్గతమవడం దరిమిలా విధానపరమైన అవకతవకల విషయమై ఈసీఐ వైఖరిలో మార్పు చోటుచేసుకున్నది.

ఏడు రాష్ట్రాల-- ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, తెలంగాణ, నాగాలాండ్-- ఎన్నికల ప్రధానాధికారులకు ఈ నెల 6న భారత ఎన్నికల సంఘం రాసిన లేఖ సర్ విషయంలో ఆ రాజ్యాంగ సంస్థ బహిరంగంగా తన నిర్ణయాలను వెనక్కి తీసుకోవడంలో ఒక అత్యంత ముఖ్యమైన ఘట్టం. ఆ ఏడు రాష్ట్రాల ముసాయిదా సర్ ఓటర్ జాబితాల నుంచి పేర్లు తొలగించిన 4.52 కోట్ల మంది ఓటర్లకు అనేక ఉపశమనాలను కల్పించింది. అఖిల భారత స్థాయిలో ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్, డూప్లికేట్' కారణాలతో మొత్తం 13.3 కోట్ల మంది పేర్లను తొలగించడం జరిగింది. ఇప్పుడు ప్రస్తావిత ఏడు రాష్ట్రాలలో ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించేందుకు నిర్దేశించిన గడువును కూడా రద్దు చేశారు. గడువులోగా ఆ ఫారాలను సమర్పించలేకపోయినవారు ఇప్పటికీ వాటిని సమర్పించే వెసులుబాటు ఉన్నది. నివాసం మారినవారు ఫారం--6 సమర్పించడంలో ఉన్న ప్రయాసలకు లోనుకావలిసిన అవసరం లేదు. తమ కొత్త చిరునామా వివరాలను తప్పనిసరిగా తెలియజేయాలి. అలాగే మురికివాడల తొలగింపు వంటి కారణాల వల్ల ఇళ్లు కోల్పోయినవారూ ధ్రువపత్రాల కోసం అధి కారుల చుట్టూ తిరగడం వంటి ప్రయాస పడనవసరం లేదు. బీఎల్ఓలే క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదికను సమర్పిస్తే వారి పేర్లను కూడా ఓటర్ల జాబితాలో చేర్చేలా ఈసీఐ వీలు కల్పించింది. ఈసీఐ ఆదేశంలో విస్తృత ప్రభావం చూపే రెండు ఉపసంహరణలు అంతర్భూతంగా ఉన్నాయి. ఇప్పటివరకూ ఓటర్ల జాబితాల నుంచి అన్యాయంగా తొలగించిన ఏ ఓటర్ పేరు అయినా తిరిగి జాబితాలోకి రావడానికి ఒకే ఒక మార్గం ఉందని ఈసీఐ పట్టుబడుతూవచ్చింది. తాను 'కొత్త ఓటర్'నని తప్పుగా ప్రకటించి ఫారం--6 నింపి సమర్పించాలి. సదరు ఓటర్‌కు ఒక కొత్త ఓటర్ ఫొటో గుర్తింపుకార్డు నెంబర్‌ను కేటాయిస్తారు. ఈ నెంబర్‌తోనే జాబితాలో అతడి పేరును చేర్చుతారు. సదరు ఓటర్ల దరఖాస్తులను ఓటర్ల నమోదు నిబంధనలలోని రూల్ 21(1) ప్రకారం అధికారులు పరిశీలిస్తారు. పొరపాటున లేదా అజాగ్రత్తగా వదిలివేసిన పేర్లను చక్కదిద్దేందుకు ఈఆర్ఓలు తగుచర్యలు తీసుకుంటారు. మరో మార్పు ఏమిటంటే ఓటర్ జాబితాలలో పేర్లను తిరిగి చేర్చిన వారికి పాత ఓటర్ ఫొటో గుర్తింపుకార్డు నెంబర్‌ను ఇవ్వాలని ఈసీఐ నిర్దేశించింది. ఇది స్వాగతించవలసిన విషయం. ఈ రెండు మార్పులు భారత ఎన్నికల సంఘం వైఖరిలో వచ్చిన మార్పులను స్పష్టం చేస్తున్నాయి.

సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలతో ఈసీఐకి తనపై విమర్శలలో వాస్తవికతను గ్రహించడం అనివార్యమయింది. ఢిల్లీలో సర్ ప్రక్రియ తీరుతెన్నులను ప్రశ్నిస్తూ సమాచార హక్కు కార్యకర్తలు అంజలి భరద్వాజ్, అమృతా జోహ్రి దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా 'ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్, డూప్లికేట్' (ఏఎస్‌డీడీ) జాబితాలో ఉన్నవారిని ఫారం 6ను నింపమనడం 'పొరపాటు', 'అసమంజ సత్వం' అవుతుందని సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'ఓటర్ జాబితా నుంచి తొలగించిన వ్యక్తులను మళ్లీ ఫారం 6 నింపి కొత్త ఓటర్లుగా దరఖాస్తు చేసుకోవాలని నిర్దేశించడం తప్పుకాదా? ఒక ఓటర్ తన నివాసాన్ని మార్చుకుంటే ఆ కొత్త చిరునామా వివరాలను మాత్రమే తెలియజేసే అవకాశం ఎందుకు ఇవ్వకూడదు? ఎన్యుమరేషన్ ఫారాలను నిర్దేశిత గడువులోగా సమర్పించలేదని ఓటర్ జాబితాల నుంచి తొలగింపునకు గురైన వ్యక్తులు, ఆ తరువాత అదే ఫారాలను సమర్పించే అవకాశం ఎందుకు ఇవ్వకూడదు?' అంటూ ఈసీఐని నిశితంగా ప్రశ్నించింది. సర్ జాబితా నుంచి తొలగించిన ఏఎస్‌డీడీ కేటగిరీ ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారం లేదా ఫారం--8 ద్వారా ఓటర్ జాబితాలో తమ పేరు తిరిగి నమోదు చేసుకునేందుకు అనుమతించాలని ఈసీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది.

సుప్రీంకోర్టు అభ్యంతరాలు, ఆదేశాలకు ఈసీఐ చురుగ్గా ప్రతిస్పందించలేదు. ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేసింది. పైగా ఒక విడ్డూరమైన వివరణ జారీ చేసింది. సర్ ముసాయిదా జాబితాలో పేరు గల్లంతైనవారు ఫారం--6ను సమర్పించడం ద్వారా తిరిగి ఓటరుగా నమోదు చేసుకోవచ్చని ఈసీఐ స్పష్టం చేసింది. ప్రస్తుతం సాగుతున్న సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల ముసాయిదా జాబితాలో పేరు గల్లంతైనవారు ఫారం--6తో పాటు మొదటిసారి ఓటరుగా నమోదు చేసుకుంటున్నామన్న ధ్రువీకరణ కూడా ఇవ్వాల్సి ఉంటుంది. 'పాత ఓటర్లు ఫారం--6 సమర్పించినట్టయితే వారిపై ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 31 కింద చర్యలు తీసుకోవడం ఉండదు. కేవలం చట్టవిరుద్ధంగా, తప్పుడు ధ్రువీకరణలు ఇచ్చినవారే చర్యలు ఎదుర్కోవలసివస్తుంది' అని కూడా ఈసీఐ తన వివరణలో స్పష్టంగా పేర్కొంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే, మీరు తప్పుడు ధ్రువీకరణలు ఇస్తున్నారన్న వాస్తవం మాకు తెలుసు. అయినప్పటికీ మిమ్ములను నిబంధనల ప్రకారం శిక్షించం అని ఈసీఐ అభయమిచ్చింది!

ఈసీఐ వైఖరిలో మార్పు సర్ వ్యతిరేక ఉద్యమానికి ఒక నైతిక విజయమే. భారత ఎన్నికల సంఘం పాత తరహాలో ప్రతి ఓటరునూ కలుపుకు వెళ్లే సానుకూల వైఖరితో మాట్లాడుతోంది. ఏమైతేనేం, సర్ లోపభూయిష్ఠంగా ఉన్నదన్న వాస్తవాన్ని ఈసీఐ గుర్తించింది, అంగీకరించింది. అయితే సర్ ప్రక్రియ అమలు ఇప్పటికే పూర్తయిన రాష్ట్రాల్లోని ఓటర్లకు ఈ కొత్త విధానాలను ఉపయోగించుకునేందుకు ఎందుకు అవకాశమివ్వడం లేదు? అన్నది జవాబు లేని ప్రశ్న. ఢిల్లీలో కంటే బెంగళూరులోనే ఎక్కువ మంది ఓటర్ల పేర్లను ఓటర్ జాబితాల నుంచి తొలగించారు. ఈసీఐ సరికొత్తగా కల్పించిన ఉపశమనాల నుంచి బెంగళూరు ఓటర్లు ఎందుకు లబ్ధి పొందడం లేదు? అసలు సర్ జాబితాల నుంచి పెద్ద ఎత్తున తొలగింపులు జరిగిన ఓటర్ జాబితాల ప్రాతిపదికన అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల మాటేమిటి? ఆ రాష్ట్రాలలో సర్ వాస్తవంగా పూర్తయింది. మరి ఆ రాష్ట్రాలలో ఇప్పటికే ఫారం--6ను సమర్పించిన వారికి ఏమి జరిగింది? వారికి వారి పాత ఎపిక్ కార్డు నెంబర్‌ను కేటాయిస్తారా? అసలు ప్రశ్న ఏమిటంటే-- ఆ రెండు రాష్ట్రాలు, ఇతర రాష్ట్రాలలో పెద్ద ఎత్తున సంభవించిన ఓట్ల తొలగింపును సరిదిద్దేందుకు ఈసీఐ ప్రత్యేక చొరవ తీసుకుంటుందా? లేక ఈ కొత్త ఆదేశాలను కాగితాలకే పరిమితం చేసి, కేవలం కొద్దిమంది ఓటర్లు మాత్రమే తిరిగి జాబితాలోకి వచ్చారని సుప్రీంకోర్టులో ఒక నివేదిక దాఖలు చేస్తుందా?

సర్ ప్రక్రియ అమలు విధానాలలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి, సందేహం లేదు. అయితే సర్ నిర్మాణాత్మక లక్షణాలు యథాతథంగా ఉన్నాయి. ఇవి సార్వత్రిక వయోజన ఓటుహక్కు అనే ప్రజాస్వామిక సూత్రానికి వ్యతిరేకమైనవి. సవరించిన నిబంధనలు సైతం తమ పేరు ఓటర్ జాబితాలలో ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యతను ఓటర్ పైనే మోపాయి. ఇది ప్రజాస్వామ్య సూత్రాలకే విరుద్ధం కాదా? పైగా తాము ఈ దేశ పౌరులమని నిరూపించుకోవల్సిన బాధ్యత కూడా ఓటర్లదేనని ఆ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. సవరించిన నిబంధనలు, కల్పించిన ఉపశమనాలు ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వచ్చినప్పటికీ, సర్ అప్రజాస్వామిక ధోరణిలో మార్పు ఉండబోదనడంలో కూడా సందేహం లేదు. ఈసీఐ తాత్కాలికంగా వెనక్కి తగ్గినప్పటికీ ఓటర్ల హక్కులను కాలరాస్తున్న లోపభూయిష్ఠ సర్‌ను పూర్తిగా రద్దు చేసేంతవరకు వీధుల్లో ప్రజల ప్రజాస్వామిక పోరాటాలు అనివార్యమవుతాయి. చెప్పవచ్చినదేమిటంటే, ఈసీఐ తన తప్పు ఒప్పుకున్నదిగానీ ఓటర్లకు సంపూర్ణ న్యాయం జరగలేదు. ఓటర్లకు కొత్తగా కల్పించిన ఉపశమనాలు నేరాన్ని అంగీకరించడం మినహా మరేమీ కావు. ఓట్ల తొలగింపు అన్యాయాన్ని అవి పూర్తిగా తొలగించలేవు. ఎందుకంటే సర్ స్వాభావికంగా న్యాయవిరుద్ధమైనది. దానిని పూర్తిగా రద్దు చేసి సరికొత్తగా ప్రారంభించాలి. ఇది మాత్రమే మన ప్రజాస్వామ్య పురోగతికి దోహదం చేస్తుంది.

నమ్మకమైన వ్యాపార భాగస్వామి ఉంటే విజయాలు తథ్యం: సీఎం చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి

"2024 జూన్ నుంచి రూ.22.6లక్షల కోట్లకు సంబంధించిన 714 ఒప్పందాలు కుదుర్చుకున్నాం. రెండున్నరేళ్లలో పెట్టుబడుల్లో పురోగతి సాధిస్తూ వచ్చాం. రూ.7.3 లక్షల కోట్ల విలువైన 303 ప్రాజెక్టులు గ్రౌండింగ్‌లో ఉన్నాయి. దేశంలోనే మొదటి హైడ్రోజన్ వ్యాలీకి రాష్ట్రం వేదిక. భవిష్యత్తులో కొత్త సంస్కరణలకు తిరుపతి స్పేస్ సిటీ వేదిక కాబోతోంది. త్వరలో డ్రోన్ ఎయిర్‌టాక్సీలు రాబోతున్నాయి. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుల అభివృద్ధిలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. భారత్ 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుంది. అందులో 160 గిగావాట్లను ఏపీ అందించబోతోంది" అని సీఎం పేర్కొన్నారు.

పెట్టుబడుల భద్రతా చట్టం చేయాలి.. సీఎం కీలక ప్రతిపాదనలు

ఈ సదస్సులో సీఎం చంద్రబాబు కీలక ప్రతిపాదనలు చేశారు. పెట్టుబడుల భద్రతా చట్టం చేయాలని కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌ను కోరారు. ప్రభుత్వాలు మారినప్పుడు కక్షపూరిత రాజకీయాల నేపథ్యంలో ఇది అవసరమన్నారు. దీనిపై చట్టం చేసి పంపుతామని.. దాన్ని ఆమోదించేలా చూడాలని కేంద్రమంత్రికి సీఎం విన్నవించారు. జాతీయ స్థాయిలో చట్టం చేస్తే మరింత సంతోషిస్తానని చెప్పారు. ఈ తరహా చట్టం చేయగలిగితే అభివృద్ధిలో భారత్ దూసుకెళ్తుందన్నారు.

పేదల అభివృద్ధి కోసం మార్గదర్శి బంగారు కుటుంబం

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం వల్ల మరింత చేయూత అందుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. పేదకుటుంబాలకు చేయూత కోసం ఎంబీకే 10-20 పర్సెంట్ ప్రణాళిక తీసుకొచ్చామన్నారు. " పేదల అభివృద్ధి కోసం మార్గదర్శి బంగారు కుటుంబం ప్రతిపాదన తీసుకువస్తున్నా. 20 శాతం బడుగు వర్గాలకు 10శాతం ఉన్నత వర్గాలు చేయూత అందించాలి. దీనివల్ల బడుగు వర్గాల జీవన ప్రమాణాలు మారుతాయి. చేయూత లేకపోతే పేద కుటుంబాలు మరింత పేదరికంలోకి వెళ్తాయి. ఉన్నత వర్గాలు, బడుగు వర్గాలకు మధ్య అంతరం మరింత పెరుగుతుంది. చాలా దేశాలు ఈ విధమైన సమస్యలు ఎదుర్కొంటున్నాయి. సమానత్వం పాటించడం వల్ల కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. సరైన మార్గనిర్దేశం వల్ల ఎంఎస్ఈలు మరింత పుంజుకుంటాయి.

బ్లూ గ్రీన్ సిటీగా అమరావతి

బ్లూ గ్రీన్ సిటీగా అమరావతి రాజధాని నగరాన్ని నిర్మిస్తున్నాం. పారిశ్రామిక వేత్తలు అమరావతిని రెండో నివాసంగా మార్చుకోవాలి. నదుల అనుసంధానం ద్వారా నీరు వచ్చేలా కార్యాచరణ చేపట్టాం. గోదావరి-కావేరి లింక్ ద్వారా 5 రాష్ట్రాల దాహార్తి తీర్చే అవకాశం కల్పించాం. విద్యుత్ గ్రిడ్ లాగే వాటర్ గ్రిడ్ కూడా ఉంటే ప్రజలకు మరింత లబ్ధి చేకూరుతుంది. ఏపీలో 25 సెక్టోరల్ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. తిరుపతిని గ్లోబల్ సెమీకండక్టర్ చిప్ డిజైన్ క్యాపిటల్‌గా చేస్తాం.

ఎస్క్రో ఖాతా ద్వారా ప్రోత్సాహకాలు

పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఎస్క్రో ఖాతా ద్వారా అందిస్తాం. ఇవాళ్టి నుంచే ఎస్క్రో ఖాతా పని చేయడం ప్రారంభిస్తుంది. యాక్సెస్ టూ ఈక్వాలిటీ ఇండెక్స్‌లో ఏపీ రెండో స్థానంలో ఉంది. సామాజిక, ఆర్థిక భద్రతలో కీలక స్థానం దక్కింది. పేదల జీవన ప్రమాణాలు పెంచేలా ప్రభుత్వం పని చేస్తోంది. రూ.9.89 లక్షల కోట్ల విలువైన 303 ఎంవోయూలు చేసుకుంటాం. ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు లక్ష్యం. అంతరిక్ష రంగానికి విడిగా రూ.25వేల కోట్లు, ఆహారశుద్ధి రంగంలో రూ.30 వేల కోట్లు, దేశ పోర్టు సరకు రవాణాలో 20 శాతం వాటా లక్ష్యంగా పని చేస్తున్నాం. పోర్టుల సామర్థ్యం, రైలు అనుసంధానం, నౌకా నిర్మాణ క్లస్టర్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నాం." అని చంద్రబాబు అన్నారు.

చంద్రబాబు పాలసీ ఆంత్రప్రెన్యూర్స్ కాదు..

మొదటిపేజీ తరువాయి

విశాఖపట్నం: ముఖ్యమంత్రి చంద్రబాబు పాలసీ 'ఆంత్రప్రెన్యూర్స్ కాదు.. ఆంధ్రాప్రెన్యూర్స్' అని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. విశాఖలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొన్న ఆయన.. సమర్థ నాయకత్వం ఉన్న ఆంధ్రప్రదేశ్.. అన్ని రంగాల్లో దూసుకుపోతోందని తెలిపారు. భవిష్యత్ గురించి ముందే ఆలోచించడం చంద్రబాబు ప్రత్యేకత అని, ఒక విజన్ చేశారంటే.. విజయం సాధించేంత వరకు వదిలిపెట్టరని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న మరో అవకాశం డబుల్ ఇంజిన్ సర్కార్ అని అన్నారు. చంద్రబాబు, పవన్, లోకేశ్ సమర్థ నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి దిశగా ముందుకు వెళ్తోందని చెప్పారు.

"విశాఖను ఆర్థికాభివృద్ధి ప్రాంతంగా తీర్చిదిద్దబోతున్నాం. ఆర్థికాభివృద్ధికి దేశంలో అనేక సంస్కరణలు వస్తున్నాయి. ప్రధాని మోదీ నాయకత్వంలో గత 12 ఏళ్లుగా దేశాభివృద్ధి పరుగులు పెడుతోంది. మరోవైపు చంద్రబాబు నాయకత్వాన్ని చాలా దగ్గరి నుంచి చూస్తున్నా. నిత్య విద్యార్థిగా ఉంటూ.. కొత్త విషయాలు నేర్చుకుంటారు. సంస్కరణల అమలులో విశ్రాంతి, విరామం లేకుండా పని చేస్తారు. ఐటీ గురించి ఎవరికీ తెలియని సమయంలోనే చంద్రబాబు దాని గురించి మాట్లాడేవారు." అని రామ్మోహన్ నాయుడు అన్నారు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం.. రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్

మొదటిపేజీ తరువాయి

స్టేషన్ ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ వద్ద జాతీయ రహదారిపై కారు దగ్ధమైంది. జనగామ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న కారులో డీజిల్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇంజిన్ నుంచి పొగలు రావడాన్ని గమనించిన డ్రైవర్ కారు నిలిపివేయడంతో.. అందులో ఉన్న ఇద్దరు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. క్షణాల్లోనే మంటలు వ్యాపించి, కారు మొత్తం పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. అగ్ని ప్రమాద ఘటనతో జాతీయ రహదారిపై రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

కూకట్‌పల్లిలో ఓపెన్ ప్లాట్ల బహిరంగ వేలం..

గజం రూ.2.18లక్షలు

మొదటిపేజీ తరువాయి



హైదరాబాద్: నగరంలోని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ)లో ఓపెన్ ప్లాట్లు భారీ ధర పలికాయి. తెలంగాణ హౌసింగ్ బోర్డు గురువారం నిర్వహించిన వేలంలో కేపీహెచ్‌బీ 15వ ఫేజ్‌లో గజానికి గరిష్ఠంగా రూ.2.18లక్షల ధర పలికింది. 11 ప్లాట్ల బహిరంగ వేలంతో హౌసింగ్ బోర్డుకు రూ.33 కోట్ల ఆదాయం సమకూరింది. మరో 11 ప్లాట్లకు స్పందన రాకపోవడంతో వేలం నిర్వహించలేదు.

ప్రెస్ రిలీజ్‌లు పోయాయ్.. ఇప్పుడంతా ఇన్‌స్టా రీల్స్: మోదీ

మొదటిపేజీ తరువాయి

"విలేకరులతో నాకు సుదీర్ఘకాల అనుబంధం ఉంది. భాజపాలో చేరిన తొలినాళ్లలో మీడియా ఈవెంట్ల కోసం కుర్చీలు వేసే బాధ్యత నాదే. గడిచిన కొన్నేళ్లలో జర్నలిజంలో ఎన్నో మార్పులు వచ్చాయి. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి జరిగింది. ఒకప్పుడు మీడియా సమావేశాల ప్రసారం కోసం అవుట్‌సైడ్ బ్రాడ్‌కాస్ట్ వ్యాన్లను ఉపయోగించేవారు. ఇప్పుడు మొబైల్ ఫోనే ఈ వాహనంగా మారిపోయింది. గతంలో పత్రికా ప్రకటనలు (ప్రెస్ రిలీజ్‌లు) ఇచ్చేవారు. ఇప్పుడు సామాజిక మాధ్యమాల విస్తృతితో అన్నీ ఇన్‌స్టా రీల్స్‌లోనే తెలిసిపోతున్నాయి" అని మోదీ వివరించారు.

ఈ సందర్భంగా దేశాభివృద్ధి కోసం తమ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రధాని వివరించారు. పేదరిక నిర్మూలన కోసం కృషి చేసినట్లు పేర్కొన్నారు. "ఒకప్పుడు గరీబీ హఠావో వంటి నినాదాలు వినిపించేవి. కానీ, మా ప్రభుత్వం గత 12 ఏళ్లలో 50 కోట్ల మందిని దారిద్ర్య రేఖ నుంచి బయటపడేసింది" అని మోదీ వెల్లడించారు. దేశంలో అసాధారణ విజయాలు సాధించినవారు ఎంతోమంది ఉన్నారని.. వారి విజయ గాథలను ప్రపంచానికి తెలియజేయాలని విలేకరులను కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రమాదం ఏ రూపంలోనైనా రావొచ్చు.. ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి: రాజ్‌నాథ్ సింగ్

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: యుద్ధాల తీరు మారుతున్న నేపథ్యంలో ఏ రూపంలోనైనా ముప్పు పొంచి ఉండొచ్చని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. వాటిని ఎదుర్కొనేందుకు, ఆకస్మిక దాడులు నిర్వహించేందుకు సర్వసన్నద్ధంగా ఉండాలని సైన్యానికి పిలుపునిచ్చారు. దిల్లీలో నిర్వహించిన వైమానిక దళ కమాండర్ల సమావేశంలో (ఖూఖీ జశీఎఖిఅనవతీం వీవవీ) ఆయన మాట్లాడారు. రక్షణ, ప్రతిదాడుల విషయంలో అధునాతన పద్ధతులను బలోపేతం చేసుకోవాల్సిన అవసరముందన్నారు. నిఘా, పర్యవేక్షణ సామర్థ్యాలను నిరంతరం పెంచుకోవాలని, ముప్పును ముందే పసిగట్టి నష్టం సంభవించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని దిశా నిర్దేశం చేశారు.

"శత్రువులు కోలుకోవడానికి సమయం ఇవ్వని సామర్థ్యాలను మన రక్షణ దళాలు పెంపొందించుకోవాలి. శత్రువులు ఉన్నపళంగా దాడి చేసినా.. వారి వ్యూహంలో చిక్కుకోకుండా ముందే అప్రమత్తమయ్యేలా బలంగా మారాలి. మన చర్యలు వారి ఊహకందని విధంగా ఉండాలి. గూఢచార, నిఘా యంత్రాంగాలను మరింత బలోపేతం చేసుకోవాలి. ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనేందుకు ప్రతిక్షణం సిద్ధంగా ఉండాలి" అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్- రష్యా, ఇజ్రాయెల్- హమాస్ యుద్ధాల గురించి ఆయన ప్రస్తావించారు.

ఆధునిక యుద్ధాల్లో రైఫిళ్ల కంటే.. డ్రోన్లు, ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్‌కు ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. ఆత్మాహుతి డ్రోన్లు (కామికాజి), నిఘా డ్రోన్ల వల్ల తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సైబర్ యుద్ధాలు, అంతరిక్షంలోనే ఆయుధాలను మోహరించి శత్రువులపై దాడి చేయడం లాంటి అత్యాధునిక యుద్ధ రీతుల కోసం ప్రత్యేక విధానాలను అభివృద్ధి చేయాలని వైమానిక దళానికి పిలుపునిచ్చారు.

అడవిలో బుల్లెట్ గాయాలతో పోలీసుల మృతదేహాలు..

మొదటిపేజీ తరువాయి

జమ్మూకశ్మీర్‌లో ఇద్దరు స్పెషల్ పోలీసు ఆఫీసర్లు అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు కోల్పోవడం కలకలం రేపింది. కిశ్త్వాడ్ జిల్లాలో నిన్న (నవంబరు 11) విధులు నిర్వర్తిస్తూ అదృశ్యమైన వీరు.. గురువారం ఉదయం అటవీ ప్రాంతంలో విగతజీవులుగా కన్పించారు. వారి శరీరంపై బుల్లెట్ గాయాలున్నట్లు అధికారులు వెల్లడించారు.

స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్‌నకు చెందిన బాబీ చాంద్ (57), రశ్‌పాల్ కుమార్ (45).. బుధవారం మధ్యాహ్నం తమ క్యాంప్ నుంచి ధర్నా-మర్వా ప్రాంతంలోని ఆర్మీ పోస్ట్‌కు బయల్దేరారు. మార్గమధ్యంలో మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో వీరికి దచన్ అటవీ ప్రాంతం నుంచి శబ్దాలు వినిపించాయి. దీంతో అటుగా వెళ్లిన వీరిద్దరూ మళ్లీ తిరిగిరాలేదు. అదే సమయంలో మొబైల్ నెట్‌వర్క్ సర్వీసులు కూడా పనిచేయకపోవడం గమనార్హం.

వీరు అదృశ్యమైనట్లు నిర్ధరించుకున్న ఆర్మీ బలగాలు అటవీ ప్రాంతంలో ముమ్మర గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలోనే గురువారం ఉదయం వీరి మృతదేహాలను భద్రతా సిబ్బంది గుర్తించారు. ఘటనాస్థలంలో పోలీసు ఆఫీసర్ల సర్వీసు తుపాకులు కన్పించలేదని అధికారులు వెల్లడించారు. దీంతో ఉగ్రకోణం ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఉగ్రవాదులు వీరిని కిడ్నాప్ చేసి హత్య చేసి ఉండొచ్చని అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో నిర్బంధ తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. కాగా.. జమ్మూకశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో నిన్న సీఆర్పీఎఫ్ శిబిరంపై ఉగ్రదాడి జరిగిన సంగతి తెలిసిందే. బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో మోటార్ సైకిళ్లపై వచ్చిన ఇద్దరు ఉగ్రవాదులు చెక్‌పోస్ట్ వద్ద ఉన్న సీఆర్పీఎఫ్ సిబ్బందిపై కాల్పులు జరిపి పరారయ్యారు. దాదాపు అదే సమయంలో కిశ్త్వాడ్‌లో పోలీసులు అదృశ్యమై ప్రాణాలు కోల్పోవడం గమనార్హం. ఈ రెండు ఘటనలకు ఏదైనా సంబంధం ఉందా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సజ్జనర్ బదిలీ.. హైదరాబాద్ సీపీగా మహేశ్ భగవత్

మొదటిపేజీ తరువాయి

ఏసీబీ డైరెక్టర్‌గా ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, మల్టీ జోన్-1 ఐజీగా కార్తికేయ, రైల్వేస్ ఐజీగా కె.రమేశ్ నాయుడు, టీజీ-టీమార్స్‌లో జాయింట్ డైరెక్టర్ (రోడ్ సేఫ్టీ)గా జోయల్ డేవిస్, జోన్-7 డీఐజీగా జి.చందన దీప్తి, జోన్-2 డీఐజీగా కె.నారాయణ నాయక్, డీఐజీ కో-ఆర్డినేషన్, జోన్-6 డీఐజీగా ఎల్.ఎస్.చౌహాన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. డీఐజీ ఇంటెలిజెన్స్‌గా ఆర్.భాస్కర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

అక్రమంగా మహిళల అండాల సేకరణ.. పోలీసు కస్టడీకి నిందితులు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర చర్చనీయాంశమైన మహిళల అండాల అక్రమ సేకరణ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. నిందితులను మల్కాజిగిరి పోలీసులు 5 రోజుల కస్టడీకి తీసుకున్నారు. అండాల సేకరణ నెట్‌వర్క్‌పై దృష్టి పెట్టారు. మహిళలను తీసుకువచ్చిన ఏజెంట్లు, మధ్యవర్తుల పాత్రపై విచారణ చేపట్టారు. ఐవీఎఫ్ కేంద్రాలు, వైద్య సంస్థలకున్న సంబంధాలపై ఆరా తీస్తున్నారు. ఈ వ్యవహారంలో జరిగిన ఆర్థికలావాదేవీలపైనా దృష్టి సారించారు. సికింద్రాబాద్, మల్కాజిగిరిలోని 8 ఐవీఎఫ్ కేంద్రాలకు సంబంధాలున్నట్లు గుర్తించారు. వాటిల్లో సోదాలు నిర్వహించి కీలక సమాచారం సేకరించారు. ఇతర రాష్ట్రాల నుంచి అమాయక మహిళలను తీసుకొచ్చి వారికి డబ్బు ఆశ చూపి వారి నుంచి నిబంధనలకు విరుద్ధంగా అండాలను సేకరిస్తున్న ముఠాను రాష్ట్ర పోలీసులు ఇటీవల హైదరాబాద్ కేంద్రంగా గుర్తించిన విషయం తెలిసిందే.

సాగునీరు లేకుండా వ్యవసాయాభివృద్ధి ఎలా

- రైతు గర్జన సభలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కెటిఆర్

గాయత్రి న్యూస్ నిర్మల్ :

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ళు కావస్తున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు కాలేదని కెటిఆర్ విమర్శించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో బుధవారం నిర్మల్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇన్చార్జి రామ్ కిషన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రైతు గర్జన సభలో కెటిఆర్ ప్రసం గించారు. రైతులకు రూ.15వేల రైతు భరోసా ఇస్తామని చెప్పి ఎంతమం దికి ఇచ్చారని ప్రశ్నించారు. రైతుబంధు పేరును మార్చి రైతుభరోసాగా ప్రక టించినంత మాత్రాన రైతుల సమస్యలు పరిష్కారం కావని అన్నారు. రైతులకు పెట్టుబడి సాయం సకాలంలో అందించాలి, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి. ఎరువులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్ అందించిందని గుర్తుచేశారు. రైతు సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలను కొనసాగిం చడంతో పాటు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతులు ఎరువుల కోసం గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు.నిర్మల్ నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏమ య్యాయని బిజెపి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కెటిఆర్) ప్రశ్నిం చారు. నిర్మల్ పట్టణానికి అండర్గ్రౌండ్ అం డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని చెప్పిన హామీ ఏమైందని నిలదీశారు. గతంలో ఇదే అండర్గ్రౌ గ్రౌండ్ డ్రైనేజీ కోసం రూ.150 కోట్లు కేటాయించాలని అప్పటి ముఖ్యమంత్రి కెసీఆర్కు లేఖ రాసిన మహేశ్వర్‌రెడ్డి, ఇప్పుడు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆ పనులను ఎందుకు ముందుకు తీసుకెళ్లడం లేదని ప్రశ్నించారు.గోదావరి జలాలు రైతులకు ఎందుకు అందడం లేదు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సాగునీటి సమస్యలపై కెటిఆర్ ప్రత్యేకంగా ప్రస్తావిం చారు. గోదావరి నది పక్కనే ప్రవహిస్తున్నా రైతుల పొలాలకు మాత్రం సాగునీరు అందని పరిస్థితి ఎందుకని ప్రశ్నించారు. గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అనేక ప్రణాళికలు రూపొందించిందని తెలిపారు. ఎస్సారెస్పీ పునర్జీవ పథకం ద్వారా నీటిని ఎత్తిపోసి ప్రాజెక్టును నింపడంతో పాటు సరస్వతి కాలువ, సదర్మట్, కడెం ప్రాజెక్టులకు సాగునీరు అందించాల్సిన అవ సరం ఉందన్నారు. రైతులకు సాగునీరు అందించకుండా వ్యవసాయాన్ని ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. ప్రాజెక్టులు, కాలువలు ఉన్నప్పటికీ చివరి ఆయకట్టు రైతులకు నీరు అందకపోవడం ఆందోళనకరమన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు.

మహిళలకు ఇచ్చిన హామీలు ఎక్కడ

మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, కల్యాణలక్ష్మి పథకంలో అదనంగా తులం బంగారం



వంటి హామీలను కాంగ్రెస్ ఎన్నికల సమ యంలో ప్రకటించిందని కేటీఆర్ గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలుపై ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదని ప్రశ్నిం చారు. మహిళలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రైతు గర్జన సభ ద్వారా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే తమ ఉద్దేశమని కేటీఆర్ పేర్కొన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతులు, మహిళలు, యువతకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సభలో నిర్మల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి రామ్ కిషన్ రెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, మాజీ మంత్రి జోగు రామన్న.మా జంపి బాల్క, బోత్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, వినయ్ రెడ్డి, జీవన్ రెడ్డి, డా, కిరణ్ కొమురెవర్ సమన్యాయ కర్త ముధోల్ పడకండి రమాదేవి సమన్యాయ కర్త ముధోల్ విలాస్ గాదేవర్ రావు, సుమన్, బీఆర్ఎస్ నాయ కులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

వాల్‌మార్ట్‌తో ఏపీ ఉత్పత్తుల ఎగుమతుల విస్తరణకు చర్చలు





విశాఖపట్నం, నవంబర్ 12 (గాయత్రి న్యూస్ ప్రతినిధి రామడుగు శివ కుమార్):

ఆంధ్రప్రదేశ్ నుంచి వాల్‌మార్ట్ సంస్థ ప్రతి ఏడాది దాదాపు 500 మిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను సేకరిస్తోందని, ఈ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. విశాఖపట్నంలో జరుగుతున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో వాల్‌మార్ట్ గ్లోబల్ గవర్నమెంట్ అఫైర్స్ అండ్ బిజినెస్ డిప్లమసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పాల్ డైక్‌తో సమావేశమై చర్చించారు. ఏపీలో నిర్వహించే ఎంఎస్ఎంఈ కార్యక్రమానికి వాల్‌మార్ట్ గ్లోబల్ బయ్యర్లను ఆహ్వానించి, సముద్ర ఉత్పత్తులు, వస్త్ర రంగాల్లో అవకాశాలను పరిశీలించాలని కోరారు. స్వయం ఏపీ, లేపాక్షి బ్రాండ్ల ద్వారా కళాకారులు, మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు వాల్‌మార్ట్, ఫ్లిప్‌కార్ట్ దేశీయ, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థల్లో ప్రత్యేక అవకాశాలు కల్పించాలని ప్రతిపాదించారు. ఈ దిశగా వాల్‌మార్ట్‌తో ప్రత్యేక కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

భూముల రీసర్వే పనులపై అదనపు కలెక్టర్ ఆరా

- గంగాపూర్‌లో క్షేత్రస్థాయి పరిశీలన
- వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



బజార్ హత్నూర, గాయత్రి:

మండలంలోని గంగాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే పనులను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాయి సిదాం చిత్రు గురువారం పరిశీలించారు. గ్రామంలో సర్వే బృందాలు నిర్వహిస్తున్న కొలతల ప్రక్రియను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రీసర్వే పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత రెవెన్యూ, సర్వే అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె. శ్యామ్ సుందర్, మండల సర్వేయర్ బాపురావు, మండల గిర్దావర్ రాథోడ్ నూర్ సింగ్, జీపీఓ అనసూయ, గ్రామ సర్పంచ్‌తో పాటు స్థానిక రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు

కార్తీక మాస వేడుకల్లో చిన్నారుల భరతనాట్య ప్రదర్శన కనువిందు

- మయూరి నృత్య భంగిమలతో అలరించిన బాల కళాకారులు.. భక్తులను మంత్రముగ్ధులను చేసిన ప్రదర్శన



శ్రీకాళహస్తి, నవంబర్ 12,గాయత్రి న్యూస్ :రిపోర్టర్ : రంజిత్

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శ్రీ జ్ఞానప్రసూనాంబికా సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానం కళా ప్రాంగణంలో చిన్నారుల భరతనాట్య ప్రదర్శన అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవతా గీతాలు, స్వామి అమ్మవార్ల కీర్తనలకు అనుగుణంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.సంప్రదాయ వస్త్రధారణ, అద్భుతమైన నృత్య భంగిమలు, మయూరి ఆకృతులను తలపించే అభినయాలతో బాల కళాకారులు తమ ప్రతిభను చాటుకున్నారు. చిన్నారుల హావభావాలు, లయబద్ధమైన నృత్య ప్రదర్శనకు భక్తులు, ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది.దేవస్థానం, ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు చిన్నారుల్లో దాగి ఉన్న కళాత్మక ప్రతిభను వెలికితీయడంతో పాటు భారతీయ సాంస్కృతిక సంప్రదాయాలను ప్రోత్సహించేందుకు దోహదపడుతున్నాయి. కార్తీక మాస ఆధ్యాత్మిక వాతావరణంలో చిన్నారుల నాట్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

నందికొట్కూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఫాతిమాబీకి జగన్ అభినందనలు



తాడేపల్లి, నవంబర్ 12 (గాయత్రి న్యూస్ ప్రతినిధి రామడుగు శివ కుమార్):

నందికొట్కూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన షేక్ ఫాతిమాబీ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కుటుంబ సభ్యులతో కలిసి పార్టీ కేంద్ర కార్యాలయంలో జగన్‌ను కలిసిన ఆమె, మున్సిపల్ ఎన్నికలు, కౌంటింగ్ సందర్భంగా ఎదురైన పరిణామాలను వివరించారు. ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన ఫాతిమాబీని జగన్ అభినందించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, డాక్టర్ సుధీర్, ఫాతిమాబీ భర్త, పార్టీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్ అహ్మద్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ గఫార్ పాల్గొన్నారు.

పునరుత్పాదక విద్యుత్ రంగంలో పెట్టుబడులపై ఆరా



విశాఖపట్నం, నవంబర్ 12 (గాయత్రి న్యూస్ ప్రతినిధి రామడుగు శివకుమార్):

విశాఖపట్నంలో జరుగుతున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా పలువురు మంత్రులు, శాసనసభ్యులు, ఉన్నతాధికారులను కలిశాను. ఈ సందర్భంగా విద్యుత్ శాఖకు సంబంధించి ముఖ్యంగా పునరుత్పాదక విద్యుత్ రంగంలో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, వివిధ ప్రాజెక్టుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నాను. రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన రంగ అభివృద్ధి, విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెంపునకు సంబంధించిన అంశాలపై చర్చించడం జరిగింది.

విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు కేంద్ర మంత్రులకు స్వాగతం





విశాఖపట్నం, నవంబర్ 12 (గాయత్రి న్యూస్ ప్రతినిధి రామడుగు శివకుమార్):

విశాఖపట్నంలో నిర్వహిస్తున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు విచ్చేసిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడులకు ఘనంగా స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారితో పాటు పలువురు ప్రముఖులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే పెట్టుబడులకు అత్యంత ప్రాధాన్యత కలిగిన గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యానికి కేంద్ర మంత్రుల రాక మరింత ప్రోత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు.

మార్కాపురం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జెడ్పీ చైర్మన్ కందుల రామిరెడ్డి

మార్కాపురం, నవంబర్ 12(గాయత్రి న్యూస్ ప్రతినిధి రామడుగు శివకుమార్):

మార్కాపురం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన జెడ్పీ చైర్మన్ కందుల రామిరెడ్డి.

ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యలు, మార్కాపురం జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించే అంశాలపై చర్చించినట్లు తెలిసింది.



ఏలేశ్వరం ప్రజల తీర్పును తారుమారు చేశారు.. సీసీ ఫుటేజ్ బయటపెట్టాలి-బదిరెడ్డి గోవింద్

- ఆర్డీవో, జేసీలతో శివాలయం వద్ద ప్రమాణానికి సిద్ధమా టీడీపీ నేతలకు సవాల్
- నూతన చైర్మన్ యార్లగడ్డ అక్షితకు ఆశాలత శుభాకాంక్షలు..
- వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని హితవు
- శిడగం వెంకటేశ్వరరావు, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, కోరాడ ప్రసాద్ టీడీపీ నేతల వ్యాఖ్యలకు కౌంటర్



గాయత్రి న్యూస్

ఏలేశ్వరం మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం రాజకీయ వివాదం మరింత ముదురుతోంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. గతంలో టీడీపీ నాయకులు నిర్వహించిన మీడియా సమావేశానికి కౌంటర్‌గా వైసీపీ చైర్మన్ అభ్యర్థి బదిరెడ్డి ఆశాలత గోవింద్ ఆధ్వర్యంలో గురువారం మరోసారి ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుల వ్యాఖ్యలను వైసీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు.

వ్యక్తిగత విమర్శలపై ఆశాలత అభ్యంతరం

బదిరెడ్డి గోవింద్ నివాసం వద్ద నూతన కౌన్సిలర్లు, పట్టణ ముఖ్య నాయకులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆశాలత మాట్లాడుతూ, తాను, తన భర్త ప్రేమించి వివాహం చేసుకున్న విషయం అందరికీ తెలిసిందేనని, రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత జీవితంపై విమర్శలు చేయడం తగదని అన్నారు. అటువంటి వ్యాఖ్యలు చేస్తున్న నాయకులు మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ఏలేశ్వరం మున్సిపాలిటీ నూతన చైర్మన్ యార్లగడ్డ అక్షితకు శుభాకాంక్షలు తెలిపి, ప్రజలు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గతంలో కౌన్సిలర్‌గా, అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా పనిచేసిన అనుభవం తనకు ఉందని, ప్రజాతీర్పు తమకు అనుకూలంగా ఉన్నప్పటికీ అధికారుల అండతో ఫలితాలను తారుమారు చేశారని ఆరోపించారు.

కౌంటింగ్ అక్రమాలపై వైసీపీ నేతల ఆరోపణలు

వైసీపీ పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రజాస్వామ్యబద్ధంగా జరగలేదని, అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఫలితాలను తారుమారు చేశారని ఆరోపించారు. 17వ వార్డు కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ తన ప్రత్యర్థి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రూ.50 వేలు ఇస్తే నామినేషన్ ఉపసంహరించుకుంటాడని కొందరు తన వద్దకు వచ్చి చెప్పారని పేర్కొన్నారు. స్వామి మాల ధరించి ఉన్నందున ఈ వ్యవహారంపై ఇంతకంటే ఎక్కువగా మాట్లాడదలుచుకోలేదన్నారు. 20వ వార్డు కౌన్సిలర్ సుంకర రాంబాబు మాట్లాడుతూ వార్డుల విభజన సమయంలోనే అక్రమాలు జరిగాయని, కొన్ని వార్డుల్లో ఓటర్ల సంఖ్య 400 దాటకుండా అధికారులను ఉపయోగించుకున్నారని ఆరోపించారు. 15వ వార్డు కౌన్సిలర్ కోరాడ రామలక్ష్మి ప్రసాద్ మాట్లాడుతూ తప్పుడు ఆరోపణలను ప్రజలు నమ్మబోరని, ప్రజలు తమ వెంటే ఉన్నారని అన్నారు.

సీసీ ఫుటేజ్ బహిర్గతం చేయాలి.. బదిరెడ్డి గోవింద్ సవాల్

వైసీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి బదిరెడ్డి గోవింద్ మాట్లాడుతూ కౌంటింగ్ సమయంలో అధికార బలాన్ని ఉపయోగించి ఆర్డీవో, జేసీ, పోలీసుల సహకారంతో ప్రజాతీర్పును తారుమారు చేశారని ఆరోపించారు. 11 ఓట్ల అంశాన్ని ఆధారంగా చేసుకుని తమపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అధికారంలో ఉన్నవారికి చిత్తశుద్ధి ఉంటే కౌంటింగ్‌కు సంబంధించిన సీసీ ఫుటేజ్‌ను ప్రజల ముందు బహిరంగంగా ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. తాము చేసిన వ్యాఖ్యల్లో తప్పు ఉందని నిరూపిస్తే సగం గుండు చేయించుకుని నెల రోజులపాటు ఏలేశ్వరంలో తిరుగుతానని సవాల్ విసిరారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరగలేదని నిరూపించాలంటే పెద్దాపురం ఆర్డీవో, జేసీలను ఏలేశ్వరం శివాలయం వద్దకు తీసుకువచ్చి ప్రమాణం చేయించాలని వ్యాఖ్యానించారు. సుమారు వారం రోజుల తర్వాత టీడీపీ నాయకులు నిర్వహించిన ప్రెస్‌మీట్ రాజకీయ నాటకంలో భాగమని విమర్శించారు. 2029 ఎన్నికల్లో ప్రజలు తగిన సమాధానం చెబుతారని అన్నారు. ఎవరో ఒకరిద్దరూ వల్ల ఏలేశ్వరం మున్సిపాలిటీ ప్రజలను గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్ అని అనడం సరికాదన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం ఏలేశ్వరంలో వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి. కౌంటింగ్ అక్రమాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలు, సీసీ ఫుటేజ్ బహిరంగ ప్రదర్శన డిమాండ్‌పై అధికారుల స్పందన ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.ఈ కార్యక్రమంలో పైల విజయ్,దత్తి రాజా,వాగు బలరాం,బూర్ల సత్తిబాబు,భజంతుల లక్ష్మణరావు, ధనేడి చిన్నా, రాచర్ల రమేష్, భీశెట్టి రాజా తదితరులు పాల్గొన్నారు.

ఎల్.బి.ఆర్.సి.ఈ. ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగంలో అధ్యాపకునికి పీహెచ్‌డీ ప్రదానం

గాయత్రి న్యూస్

స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలోని ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఇంటూరి దక్షిణామూర్తి కి, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం కాకినాడ మెకానికల్ విభాగంలో ఎక్స్పెరిమెంటల్ స్టడీస్ ఆన్ సింగిల్ ఎక్స్‌పాన్షన్ ర్యాంప్ నాజిల్ అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రదానం చేశారు. ఈ పరిశోధన ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ పి. లోవరాజు మరియు జె.యన్ .టి.యు రిటైర్డ్ ప్రొఫెసర్ వి.రామచంద్ర రాజు పర్యవేక్షణలో జరిగింది. ఈ పరిశోధనలో సూపర్‌సోనిక్ ప్రవాహాల లక్షణాలు, నాజిల్ పనితీరు, పీడన పంపిణీ, షాక్ వేవ్ నిర్మాణాలు మరియు ద్వితీయ ద్రవ ఇంజెక్షన్ ప్రభావాలను ప్రయోగాత్మకంగా, విశ్లేషించారు. ఈ పరిశోధన సూపర్‌సోనిక్ ప్రవాహాలపై శాస్త్రీయ అవగాహనను పెంపొందించడంతో పాటు, ఏరోస్పేస్ రంగంలో మరింత సమర్థవంతమైన ప్రొపల్షన్ వ్యవస్థల రూపకల్పనకు విలువైన మార్గదర్శకత్వం అందిస్తుంది. సంప్రదాయ యాంత్రిక భాగాల అవసరం లేకుండా ద్వితీయ ద్రవ ఇంజెక్షన్ ద్వారా జెట్ దిశను నియంత్రించే అవకాశాలను పరిశీలించడం ఈ పరిశోధనలో ప్రధాన ప్రత్యేకత. ఈ అధ్యయన ఫలితాలు భవిష్యత్తులో విమానాలు, అంతరిక్ష వాహనాలు మరియు అధునాతన ఏరోస్పేస్ ప్రొపల్షన్ వ్యవస్థల్లో సమర్థవంతమైన, సరళమైన థ్రస్ట్ వెక్టర్ నియంత్రణ సాంకేతికతల అభివృద్ధికి ఉపయోగపడనున్నాయి. దీనితోపాటుగా ప్రొఫెసర్ పి. లోవరాజు మరియు ప్రొఫెసర్ వి. రామచంద్ర రాజు పర్యవేక్షణలో, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం కాకినాడ మెకానికల్ విభాగంలో "ఫ్లో ఫీల్డ్ క్యారెక్టరిస్టిక్స్ ఓవర్ ఫార్వర్డ్ అండ్ బ్యాక్‌వర్డ్ ఫేసింగ్ స్టెప్ కాన్ఫిగరేషన్స్ ఆన్ బ్లఫ్ బాడీస్" అనే అంశంపై చేసిన పరిశోధనకు, జె .న .టి .యూ



కాకినాడలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న వి. మని కుమార్ కి కూడా పీహెచ్‌డీ ప్రదానం చేసారని ప్రొఫెసర్ పి. లోవరాజు తెలియజేసారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ పి. లోవరాజు, అధ్యాపక సిబ్బంది మరియు విద్యార్థులు డా. ఇంటూరి దక్షిణామూర్తికి అభినందనలు తెలిపారు.(డా. కె. అప్పారావు) ప్రిన్సిపాల్

పార్టీ మాటే శిరోధారంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ మాటే నా బాటగా ప్రయాణం సాగిస్తాను

గాయత్రి న్యూస్



అందరికి ధన్యవాదాలు రాత్రి నుండి నాకు ఫోను ద్వారా మెసేజ్లు ద్వారా మాట్లాడిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు.పార్టీ మాటే శిరోధారంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ మాటే నా బాటగా ప్రయాణం సాగిస్తాను.స్థానిక ఎన్నికలలో అవకాశం కల్పించిన సురనేని నివృతరావుకి శుభాకాంక్షలు.ఈ రోజు నుండి యధావిధిగా వారి గెలుపు కోసం కృషి చేస్తూ కష్టపడతానని, రానున్న రోజుల్లో ఇంకా మంచి స్థాయికి చేరుకునేలా,ఎవ్వరు అధైర్య పడవద్దు మునుపటి వలె మీ కష్ట కాలంలో మీకు తోడుగా ఉంటానని,నన్ను ఆదరించి అభిమానించే వారందరికీ తోడుగా ఉంటానని, ఇప్పటివరకు నాకు తోడుగా ఉంటూ నన్ను ఆదరించి అభిమానించిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసుకుంటూ లంక లితీష్
మైలవరం తెలుగు యువత అధ్యక్షులు
మైలవరం నియోజకవర్గం

మైలవరం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా జమీందారులు సూరనేని నివృత్తు రావుని ప్రకటించిన

- ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్



గాయత్రి న్యూస్

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా మైలవరం గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా అఖండ మెజార్టీతో గెలిపించాలని కూటమి నేతలకు, గ్రామ ప్రజలకు సూచించిన ఎమ్మెల్యే వసంత సర్పంచి అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే తెలుసుకున్న మైలవరం గ్రామంలోని వివిధ కుల పెద్దలు, గ్రామస్తులు, వివిధ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో చేరుకొని నివృత్ రావు కి శుభాకాంక్షలు అభినందనలు తెలియజేసి వారి సంఘీభావాన్ని వ్యక్తం చేశారు సర్పంచి అభ్యర్థి నిర్ణయం పట్ల హర్షశీ వ్యక్తం చేస్తున్న మైలవరం గ్రామ ప్రజలు.ప్రశాంత వాతావరణంలో మైలవరం ప్రజలు మైలవరం పట్టణ అభివృద్ధే ధ్యేయంగా అహర్నిశలు సేవలందించినున్న సర్పంచ్ అభ్యర్థి నివృత్ రావు

ఎన్నికల అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన వ్యాసరచన,క్విజ్ పోటీలు

గాయత్రి న్యూస్



మైలవరం, ఎన్టీఆర్ జిల్లా డా.లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైలవరంలోరాజకీయ శాస్త్ర విభాగం అధ్యాపకురాలు షేక్ జాహిదా బేగం ఆధ్వర్యంలో,ఎన్నికల అక్షరాస్యత క్లబ్ ద్వారా విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు వివిధ పోటీలు నిర్వహించారుఈ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛమైన ఓటర్ల జాబితా ప్రాముఖ్యత అనే అంశంపై వ్యాసరచన పోటీతో పాటు ఎన్నికల ప్రక్రియ అంశంపై క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ పోటీల ద్వారా ఓటరు నమోదు, ఓటర్ల జాబితా ప్రాముఖ్యత, ఎన్నికల విధానం, ఓటు హక్కు వినియోగం,ప్రజాస్వామ్య విలువల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారుప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి పౌరుడి భాగస్వామ్యం ఎంతో అవసరమని, స్వేచ్ఛాయుతమైన మరియు నిష్పక్షపాతమైన ఎన్నికలు జరగడానికి స్వచ్ఛమైన ఓటర్ల జాబితా కీలకమని ఈ సందర్భంగా వివరించారు. యువతలో ఓటు హక్కుపై బాధ్యత, ఎన్నికల పట్ల ఆసక్తి, ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.మాధవి మాట్లాడుతూ,విద్యార్థులు ఇటువంటి అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ప్రజాస్వామ్య విలువలను తెలుసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సయ్యద్ అబూబకర్ షహర్యార్, ఐక్యూఏసీ సమన్వయకర్త డా.ఎస్.కె.కరీముల్లా,ఇతర అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినారు

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూని మర్యాదపూర్వకంగా కలిసిన కే.గోపాలపురం ఎంపీటీసీ వేమగిరి నూకరాజు!



గాయత్రి న్యూస్

స్థానిక రావులమ్మ నగర్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం జగ్గంపేట శాసనసభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ ని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు గండేపల్లి మండలం, కే.గోపాలపురం ఎంపీటీసీ సభ్యులు వేమగిరి నూకరాజు.ఈ సందర్భంగా ఎంపీటీసీ వేమగిరి నూకరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆశీస్సులతో, స్వర్గీయ అవసరాల బాలసుబ్రహ్మణ్యం తనయుడు శ్రీనివాస్ నాయకత్వంలో కే.గోపాలపురం గ్రామంలో అఖండ మెజార్టీతో టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థిగా విజయం సాధించాను.ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి, ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తాను" అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కె గోపాలపురం తెలుగుదేశం జనసేన కూటమి నాయకులు పాల్గొన్నారు.

గండేపల్లి టీడీపీ పగ్గాలు యువనేతకు

- గ్రామ అధ్యక్షుడిగా బొల్లిన వేణుగోపాల్..
- ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రకటన



గాయత్రి న్యూస్

గండేపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ నూతన అధ్యక్షుడిగా యువనేత బొల్లిన వేణుగోపాల్ నియమితులయ్యారు. ఈ మేరకు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గురువారం జగ్గంపేటలోని పార్టీ కార్యాలయంలో అధికారికంగా ప్రకటించారు.సీనియర్ టీడీపీ నాయకులు కీర్తిశేషులు బొల్లిన వెంకట్రావు కుమారుడైన వేణుగోపాల్ గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, యువతలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన సేవలను, పార్టీ పట్ల ఉన్న నిబద్ధతను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, మాజీ జెడ్పిటిసి పరిమి బాబు మంగతాయారు , గండేపల్లి వైస్ ఎంపీపీ కందుల చిట్టిబాబు, కిర్లంపూడి జడ్పిటిసి తోట రవి, ఎస్వీఎస్ అప్పలరాజు, అనుకూల శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ ను కలిసిన మేడికొండూరు నూతన జడ్పిటిసి కంకణాల. సుమలత దంపతులు



గాయత్రి న్యూస్

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మేడికొండూరు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున నూతనంగా ఎన్నికైన మేడికొండూరు జడ్పిటిసి కంకణాల. సుమలత దంపతులు మర్యాదపూర్వకంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి ని కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జగన్ వారిని ప్రేమతో ఆహ్వానించి వారికి అభినందనలు తెలియజేశారు. తాడికొండ నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డైమండ్ బాబు ఆధ్వర్యంలో అతనితో పాటు కలిసి పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డిని కలిసినట్లు తెలియజేశారు. జడ్పిటిసి కుటుంబ సభ్యులు మరియు డైమండ్ బాబు జగన్ను కలవడం పట్ల పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. అధికార పార్టీ నుండి ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రజల మద్దతుతో వైఎస్ఆర్సిపి అభ్యర్థిగా విజయం సాధించడం తాడికొండ నియోజకవర్గంలో ప్రాధాన్యతతో కూడిన విషయమని జగన్ మెచ్చుకున్నారు. వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల, ప్రజల యొక్క సమిష్టి కృషికి నిదర్శనమని జగన్మోహన్ రెడ్డికి డైమండ్ బాబు వివరించారు.

వివాహిత మహిళ,ఏడాది వయసున్న చిన్నారి అదృశ్యం

- అమృతలూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

గాయత్రి న్యూస్

బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం అమృతలూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గోవాడ గ్రామంలో వివాహిత మహిళతో పాటు ఆమె ఏడాది వయసున్న కుమార్తె అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోవాడ గ్రామానికి చెందిన అరుంబాక వంశీ (35)కు భార్య అరుంబాక స్వప్న (30), ఏడాది వయసున్న కుమార్తె అద్విక శ్రీ ఉన్నారు.ఈ నెల 10వ తేదీ ఉదయం 8 గంటల సమయంలో భార్యాభర్తల మధ్య చిన్న విషయంపై గొడవ జరిగింది. అనంతరం వంశీ తన రోజువారీ పనులకు వెళ్లాడు.తిరిగి ఇంటికి వచ్చి చూడగా భార్య స్వప్న, కుమార్తె అద్విక శ్రీ ఇంట్లో కనిపించలేదు.ఎవరికీ చెప్పకుండా వారు ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు వంశీ గుర్తించాడు.బంధువులు, తెలిసిన ప్రాంతాల్లో వెతికినా భార్య,కుమార్తె ఆచూకీ లభించకపోవడంతో నవంబర్ 11వ తేదీ సాయంత్రం 5 గంటలకు అమృతలూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.ఆయన ఫిర్యాదు మేరకు అమృతలూరు పోలీసులు క్రైమ్ నంబర్ 106/2026 కింద మహిళ, బాలిక అదృశ్యంపై హెచ్.సీ చంద్రం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

.....

అమృతలూరు మండలంలో గ్రామపంచాయతీ సర్పంచ్,వార్డు సభ్యుల రిజర్వేషన్ల వివరాలు

గాయత్రి న్యూస్

బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం అమృతలూరు మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వుల మేరకు ఈనెల 29వ తేదీన రెండో విడతగా నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విడుదల చేసిన వివరాలిలా ఉన్నాయని ఇన్చార్జ్ ఎంపీడీవో,చదలవాడ ఉమాదేవి తెలిపారు.అమృతలూరు గ్రామపంచాయతీ సర్పంచ్ కి – ఎస్సీ మహిళ,వార్డు సభ్యులు – జనరల్, 1,10,12, జనరల్ మహిళ, 2,3,7,14, ఎస్సీ 4,9,11, బీసీ మహిళ 5, ఎస్టి 6, ఎస్సీ మహిళ 7,13 బోడపాడు – సర్పంచ్ ఎస్సీ,వార్డు సభ్యులు – ఎస్సీ 1,3, ఎస్సీ మహిళ 2,7, జనరల్ 4,6,జనరల్ మహిళ 5,7 గోవాడ – సర్పంచ్ ఎస్టి మహిళ,వార్డు సభ్యులు – ఎస్సీ మహిళ 1,7, జనరల్ 2,4,5, జనరల్ మహిళ 3,10,12, ఎస్సీ 6,11, ఎస్టి 8, బీసీ మహిళ 9,ఇంటూరు – సర్పంచ్ జనరల్, వార్డు సభ్యులు – ఎస్సీ 1,2,11, జనరల్ 3,5,7, ఎస్సీ మహిళ 4,10,12, జనరల్ మహిళ 6,8,9,13, ఎస్టి 14,కోరుతాడిపర్రు – సర్పంచ్ జనరల్,వార్డు సభ్యులు – బీసీ మహిళ 1, బిసి 2,ఎస్సీ 5,జనరల్ మహిళ 3,4, జనరల్ 6, కూచిపూడి – సర్పంచ్ జనరల్,వార్డు సభ్యులు – జనరల్ మహిళ 1,2,8, జనరల్ 3,4,10, ఎస్సీ 5,11, బిసి 6, ఎస్సీ మహిళ 7,12, ఎస్టీ మహిళ 9,మోపర్రు – సర్పంచ్ జనరల్ మహిళ,వార్డు సభ్యులు – ఎస్సీ మహిళ 1,3,8, ఎస్సీ 2,9,10, జనరల్ 4,6,11,జనరల్ మహిళ 5,7,12,మూల్పూరు – సర్పంచ్ జనరల్,వార్డు సభ్యులు – జనరల్ మహిళ 1,2,6,7, జనరల్ 3,4,5, ఎస్సీ 8,10,11,14, ఎస్సీ మహిళ 9,12,13,పాంచాళవరం – సర్పంచ్ ఎస్సీ మహిళ,వార్డు సభ్యులు – ఎస్సీ 1,3,10, ఎస్సీ మహిళ 2,4, జనరల్ మహిళ 5,6,8, జనరల్ 7,9, పెదపూడి – సర్పంచ్ జనరల్ మహిళ,వార్డు సభ్యులు – ఎస్టి 1, జనరల్ మహిళ 2,5,10, ఎస్సీ 4,7, ఎస్సీ మహిళ 3,6,8, జనరల్ 9,11,12,ప్యాపర్రు – సర్పంచ్ ఎస్సీ మహిళ,వార్డు సభ్యులు – ఎస్సీ 1,2,5, ఎస్సీ మహిళ 3,4, జనరల్ మహిళ 6,7,10, జనరల్ 8,9,తురుమెళ్ళ – సర్పంచ్



ఎస్సి,వార్డు సభ్యులు – ఎస్సీ 1,7, ఎస్సీ మహిళ 2,8, జనరల్ 3,5, జనరల్ మహిళ 4,6,వామనగుంట పాలెం – సర్పంచ్ జనరల్, వార్డు సభ్యులు – బిసి 1, బీసీ మహిళ 2, జనరల్ 3, జనరల్ మహిళ 4,యడ్లూరు – సర్పంచ్ ఎస్ సి, వార్డు సభ్యులు, ఎస్సీ మహిళ 1,2, బీసీ మహిళ 3, జనరల్ 4,8,9, జనరల్ మహిళ 5,10, బిసి 6,ఎస్సీ 7,యలవర్రు – సర్పంచ్ జనరల్ మహిళ,వార్డు సభ్యులు – ఎస్సీ మహిళ 1,2,8, జనరల్ 3,5,7, జనరల్ మహిళ 4,6, ఎస్సీ 9,10 రిజర్వేషన్ల ప్రకారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో తెలిపారు.

నల్లచీకటి ముసుగులో... ఏం జరుగుతోంది

- అక్కంపేట 'శ్రీ స్మార్ట్ సిటీ' లేఅవుట్‌లో అర్ధరాత్రి సంచలనాత్మక కదలికలు
- పదుల సంఖ్యలో లారీలు, గుట్టుచప్పుడు కాకుండా బస్తాల తరలింపు
- ఆశ్చర్యంలో గ్రామస్తులు... పట్టించుకోని ఉన్నతాధికారులు



గాయత్రి న్యూస్

తిరుపతి జిల్లా సరిహద్దు మండలమైన తడ ప్రాంతంలో అర్ధరాత్రి వేళ వింత ఘటనా పరిణామాలు స్థానికంగా తీవ్ర కలకలం రేపుతున్నాయి. అక్కంపేట సమీపంలోని 'శ్రీ స్మార్ట్ సిటీ' లేఅవుట్ కేంద్రంగా రాత్రి పూట జరుగుతున్న అనుమానాస్పద కార్యకలాపాలు పలు విమర్శలకు, అనుమానాలకు తావిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా చీకటి పడితే చాలు, సదరు లేఅవుట్‌లోకి పదుల సంఖ్యలో వాహనాలు పట్టాలు కప్పుకుని నిశ్శబ్దంగా చేరుకుంటున్నాయి. ఆ వాహనాలపై కొందరు వ్యక్తులు ఉండి, గుర్తు తెలియని బస్తాలను వేగంగా దించుతున్నారు. అక్కడితో ఆగకుండా, ఆ సమీపంలోకి వచ్చే పదుల సంఖ్యలోని భారీ లారీల్లోకి ఆ బస్తాలను లోడ్ చేసి, మళ్లీ జాగ్రత్తగా పట్టాలు కప్పి అర్ధరాత్రి దాటిన తర్వాత లొకేషన్ నుంచి దాటించేస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా అత్యంత గుట్టుచప్పుడు కాకుండా, పక్కా ప్రణాళిక ప్రకారం జరుగుతుండటం గమనార్హం.జనావాసాలకు, సమీప గ్రామాలకు నడిమధ్యలో ఉన్న ఈ స్థలంలో రాత్రికి రాత్రే ఇన్ని వాహనాలు రావడం, రవాణా సాగించడం చూసి చుట్టుపక్కల నివసించే ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి గురవుతున్నారు. "ఆ బస్తాల్లో ఉన్నది ఏంటి అది అనుమతి ఉన్న సరుకా లేక ఏదైనా అక్రమ రవాణానా" అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల కన్నుగప్పి రాత్రి వేళల్లోనే ఈ రవాణా సాగించడం వెనుక పెద్ద తలకాయల హస్తం ఉందేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అత్యంత సున్నితమైన సరిహద్దు ప్రాంతంలో ఇలాంటి అనుమానాస్పద కదలికలు జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు, పత్తా లేకుండా పోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, ఆ లేఅవుట్‌లో జరుగుతున్న రాత్రివేళ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆ బస్తాల్లో తరలిస్తున్న పదార్థాలు ఏమిటో సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను బయటపెట్టాలని అక్కంపేట ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి
- కూటమి సీనియర్ నేత వాసంశెట్టి సత్యం, మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి శేషారావు

గాయత్రి న్యూస్

మానవ దేహంలో కళ్ళు అత్యంత ప్రధానమైనవని, చూపు మనిషికి దేవుడిచ్చిన అమూల్యమైన వరమని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, రామచంద్రపురం మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి శేషారావు అన్నారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని, కంటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని వారు సూచించారు. గురువారం రామచంద్రపురం పట్టణంలోని ఐదో వార్డు రాజబాబు నగర్‌లో డాక్టర్ ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి, కపిలేశ్వరపురం వారి ఆధ్వర్యంలో, కొమ్మనాపల్లి సత్తిబాబు, మహాలక్ష్మి, గంపల రామకృష్ణల సహకారంతో ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వాసంశెట్టి సత్యం, మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి శేషారావు హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించి, వైద్య సేవలను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంటి చూపు సమస్యలు చిన్నవిగా ఉన్నప్పుడే గుర్తించి తగిన వైద్యం తీసుకుంటే భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను నివారించుకోవచ్చన్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.సమాజ సేవలో భాగంగా ప్రజలకు అవసరమైన వైద్య సహాయాన్ని అందించేందుకు ముందుకు వస్తున్న దాతలను, వైద్య బృందాన్ని వారు ప్రత్యేకంగా అభినందించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రజలు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను



సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ శిబిరంలో సుమారు 50 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఐదో వార్డు కౌన్సిలర్ గొర్రెల గణపతి, కొమ్మనాపల్లి సత్తిబాబు, మహాలక్ష్మి, జనసేన పార్టీ కార్యదర్శి బుంగారాజు, ప్రజాసేన అధ్యక్షులు కాటే సుబ్రహ్మణ్యం, ఏలూరు ఏసుదాసు, దొమ్మలపాటి విజయలక్ష్మి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

15

రెండో శనివారం అయినా రిజిస్ట్రేషన్లకు బ్రేక్ లేదు!

- 14వ తేదీన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం యథావిధిగా పనిచేస్తుంది
- సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్ రెహమాన్ వెల్లడి

గాయత్రి న్యూస్

ఈ నెల 14వ తేదీ రెండో శనివారం అయినప్పటికీ చిలకలూరిపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం యథావిధిగా పనిచేస్తుందని సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఆ రోజు రిజిస్ట్రేషన్లతో పాటు ఇతర రిజిస్ట్రేషన్ సంబంధిత లావాదేవీలకు ఎలాంటి అంతరాయం ఉండదని, సాధారణ పని దినాల్లో మాదిరిగానే ప్రజలకు సేవలు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు.రిజిస్ట్రేషన్ పనుల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలు, దస్తావేజు లేఖర్లు ఈ విషయాన్ని గమనించి తమ పనులను సకాలంలో పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రజలకు సేవలందించడంలో కార్యాలయం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.



నిమోనియా నివారణ బాల్యానికి భరోసా

- వైద్య అధికారి మేరీ శ్రీకళ, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్

గాయత్రి న్యూస్

ఊపిరితిత్తులలో ఇన్ఫెక్షన్ వల్ల కలిగే తీవ్రమైన శ్వాస కోశ వ్యాధి నిమోనియా అని దొడ్లేరు పిహెచ్సి వైద్యాధికారిని మేరీ శ్రీకళ అన్నారు ప్రపంచ నిమోనియా దినోత్సవం సందర్భంగా గురువారం క్రోసూరు మండలం పెరికిపాడు తండా ఎలిమెంటరీ స్కూలు నందు నిమోనియా వ్యాధిపై జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు ఆరోగ్యకరమైన సమాజం కోసం నిమోనియా పై అవగాహన పెంచుకోవాలన్నారు నిమోనియా అనేది ఊపిరితిత్తులకు వచ్చే ఒక అంటువ్యాధి అని పేర్కొన్నారు గాలి పీల్చుకోవడం కష్టమవటమే కాకుండా తీసుకునే ఆక్సిజన్ మోతాదు తగ్గిపోతుందని, అంతేకాకుండా నిమోనియా వ్యాధి కారణంగా గాలి గదుల్లో వాపు ఏర్పడుతుందని, దీంతో



ఊపిరి ఆడక పోవడం, దగ్గు, జ్వరం, ఊపిరితిత్తులలో నొప్పి, చలి మరియు అలసట లాంటివి వస్తాయని పేర్కొన్నారు ముఖ్యంగా చిన్నారులలో వచ్చే అతిపెద్ద అంటువ్యాధి అని అన్నారు పిల్లలు, వృద్ధులు ఇద్దరు సులభంగా నిమోనియాకు గురవుతారన్నారు పిల్లలు వృద్ధులకు ఇమ్యూనిటీ తక్కువగా ఉంటుందని దీని కారణంగా వీరికి నిమోనియా త్వరగా ఎటాక్ అయ్యే అవకాశం ఉంది అని పేర్కొన్నారు ఎక్సరే, రక్త పరీక్ష, కఫ పరీక్ష, ఛాతి సిటీ స్కాన్, బ్రాంకో స్కోపి వంటి పరీక్షలు ద్వారా నిమోనియాను నిర్ధారణ చేయవచ్చు అన్నారు ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ పిల్లలకు చిన్నతనంలో ఇచ్చే బీసీజీ పెర్టు సిస్ నిమోకోకల్ వ్యాక్సిన్ ఇవ్వటం వలన చిన్నారుల్లో నిమోనియాను నివారించవచ్చు అని పేర్కొన్నారు బిడ్డకు ఆరు నెలల వయసు వచ్చేవరకు తల్లిపాలు ఇవ్వడం చక్కని శుభ్రత పాటించటం వలన చిన్నారుల్లో నిమోనియా రాకుండా చాలావరకు నివారించవచ్చు అన్నారు పొగాకుకు ఎక్కువగా ఎక్స్పోజ్ కాకుండా చూసుకోవాలన్నారు ఆల్కహాల్ స్మోకింగ్ అలవాట్లు ఉంటే వెంటనే మానేయాలని రోజు వ్యాయామము చేయటం మంచిదని పోషకాహారం తీసుకోవాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు గర్భిణీ స్త్రీలు బాలింతలు అంగన్వాడీ టీచర్ మాలా వతు మాధవి భాయ్ తదితరులు పాల్గొన్నారు

శ్రీ తూలగిరి సీతారామచంద్రస్వామి ఆలయంలో 46 మంది భక్తులకు సత్యదీక్ష మాలాధారణ

- ప్రత్తిపాడులో సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం..
- తేజోమూర్తుల సుబ్రహ్మణ్య శర్మ చేతుల మీదుగా మాలాధారణ

గాయత్రి న్యూస్

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు గ్రామంలోని నరేంద్రగిరి కొండపై వివేకానంద విగ్రహం సమీపంలో ఉన్న శ్రీ తూలగిరి సీతారామచంద్రస్వామి ఆలయంలో 46 మంది భక్తులు 18 రోజుల సత్యదీక్షను స్వీకరించారు. సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బూరుగుపూడి, వెల్దుర్తి, ఇర్రిపాక, సోమరాయణంపేట, గుంటూరు, తిమ్మాపురం తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా తేజోమూర్తుల సుబ్రహ్మణ్య శర్మ విఘ్నేశ్వర పూజ, సత్యనారాయణ స్వామి పూజలను నిర్వహించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా 46 మంది భక్తులకు సత్యదీక్ష మాలాధారణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నల్లమిల్లి కృష్ణబాబు మాట్లాడుతూ.. సత్యదీక్ష స్వీకరించిన స్వాములంతా ఈ నెల 21న నిర్వహించే తెప్పోత్సవం, నవంబర్ 24న జరిగే స్వామివారి గిరిప్రదక్షిణ మహోత్సవంలో పాల్గొని స్వామివారి, అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల అనుగ్రహం పొందేలా భక్తిశ్రద్ధలతో దీక్షను కొనసాగించాలని సూచించారు. అలాగే నవంబర్ 30న అన్నవరం క్షేత్రంలో నిర్వహించే



పడిపూజ కార్యక్రమంలో సత్యస్వాములంతా పాల్గొనాలని భక్తులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెలుగూరి హరేరామ్, పసుపులేటి అర్జునరావు, కిలపర్తి సందీపకుమార్, బండి శ్రీను, యండమూరి శ్రీరంగ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో సత్యస్వాములు, మాతలు పాల్గొన్నారు.

కత్తిపూడిలో వైసీపీకి షాక్.. టీడీపీలో చేరిన 10 కుటుంబాలు

- పసుపు కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ
- వెన్నా శివ, కంచిబోయిన శ్రీను ఆధ్వర్యంలో టీడీపీలో చేరికలు..
- వైసీపీలో తగిన గుర్తింపు లేదు-టీడీపీలో చేరిన కూసుమంచి సూర్యప్రకాశరావు

గాయత్రి న్యూస్

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం, శంఖవరం మండలం కత్తిపూడిలో వైసీపీకి చెందిన 10 కుటుంబాలు టీడీపీలో చేరాయి. రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, మండల జడ్పీటీసీ కంచిబోయిన శ్రీను ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ప్రత్తిపాడులోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వ పాలనపై నమ్మకంతో పార్టీలో చేరిన వారికి స్వాగతం పలుకుతూ..కత్తిపూడిలో



టీడీపీ బలోపేతానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. టీడీపీలో చేరిన వారిలో వైసీపీ జిల్లా లీగల్ సెల్ జనరల్ సెక్రటరీ, ప్రముఖ న్యాయవాది కూసుమంచి సూర్యప్రకాశరావు, వైసీపీ నాయకులు కందుకూరి సత్యనారాయణ, కందుకూరి సూరిబాబు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కూసుమంచి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ.. వైసీపీలో తమకు తగిన గుర్తింపు లభించలేదని, ఇటీవల తరచూ పార్టీలు మారే ఓ వ్యక్తి అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నప్పటికీ పార్టీ పెద్దలు స్పందించకపోవడం బాధ కలిగించిందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని



ప్రత్తిపాడు వైసీపీ ఇన్ఛార్జి ముద్రగడ గిరిబాబు దృష్టికి తీసుకెళ్లినా ఖండించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలిపారు. మరోవైపు కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కత్తిపూడి సొసైటీ చైర్మన్ గాబు కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ వెన్నా లక్ష్మీబాబు, టౌన్ టీడీపీ అధ్యక్షులు కేళంగి జన, కొయ్యా రమణ, గాబు శివ, రౌతు శివ ఆలపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ.

- 65 మందికి వైద్య పరీక్షలు.

గాయత్రి న్యూస్

విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం లో భాగంగా గురువారం రెడ్డిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మణిబాబు రంగాపురంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలను సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థినులకు సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంగా కడుక్కోవాల్సిన విధానం, హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య పరిరక్షణలో పరిశుభ్రత ప్రాధాన్యతను వివరించారు.అనంతరం రెండు పాఠశాలల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి మొత్తం 65 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. జ్వరం, తలనొప్పితో బాధపడుతున్న ఇద్దరు విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించి, తగిన మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, కస్తూరిబా గాంధీ పాఠశాల



ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి, ఎంఎల్హెచ్పీ శిరోతేజస్విని, హెల్త్ అసిస్టెంట్ జీనత్, ఆశా కార్యకర్తలు సీత, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిర్వహించిన ఉన్నతస్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్‌తో కలిసి పాల్గొన్న కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్

- జిల్లా పోలీస్ కార్యాలయం

గాయత్రి న్యూస్

రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా గురువారం నిర్వహించిన ఉన్నతస్థాయి వీడియో



కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తో కలిసి కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాబోయే గ్రామపంచాయతీ, పెండింగ్ మున్సిపాలిటీల ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లాల వారీగా చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లు, ఎన్నికల సన్నద్ధత తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సమీక్ష నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణ, పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతపై చర్చించారు. ఎన్నికలను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం పక్కా ప్రణాళికతో పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ జి బిందుమాధవ్ స్పష్టం చేశారు.

నాగుల చవితి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు.

గాయత్రి న్యూస్



గుంటూరు జిల్లా,పొన్నూరునాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పొన్నూరు పట్టణంలోని కట్టింపుడి పుట్ట (జి.బి.సి రోడ్డు పక్కన) గల శ్రీ నాగేంద్ర స్వామి వారి పుట్ట వద్ద భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగమల్లేశ్వరి తెలిపారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, తోపులాటలకు తావులేకుండా ఈసారి ప్రత్యేకంగా ఐరన్ బారికేడ్లతో పటిష్టమైన క్యూ లైన్లను ఏర్పాటు చేశారు.దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలను అందుబాటులో ఉంచారు. ప్రత్యేక దర్శనం వీఐపీ భక్తుల కోసం ప్రత్యేక దర్శన సదుపాయాన్ని కల్పించారు.ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఎన్. జయదేవ్, కె. రవికిరణ్, వి. రామకృష్ణ మరియు ఇతర సిబ్బందితో కలిసి ఈఓ నాగమల్లేశ్వరి ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు.నాగుల చవితి వేడుకలను విజయవంతం చేసేందుకు భక్తులందరూ సహకరించాలని, క్రమశిక్షణతో క్యూ లైన్లను పాటిస్తూ స్వామివారిని ప్రశాంతంగా దర్శించుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగమల్లేశ్వరి భక్త మహాశయులకు విజ్ఞప్తి చేశారు..

ఈనెల 14 నుండి 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

గాయత్రి న్యూస్



బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం మండల కేంద్రం అమృతలూరు లో ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అమృతలూరు శాఖా గ్రంథాలయ నిర్వాహకురాలు,పి. శ్రీదేవి గురువారం తెలిపారు.ఈ వారోత్సవాల్లో భాగంగా 14 వతేదీ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభము మరియు బాలల దినోత్సవము, 15 న పుస్తక ప్రదర్శన ఏర్పాటు, పుస్తక పఠన ప్రాముఖ్యత, 16 న గ్రంథాలయ ప్రముఖులు డా॥ యస్.ఆర్.రంగనాథన్,పాతూరి నాగభూషణం మరియు శ్రీ అయ్యంకి వెంకట రమణయ్య మొదలైన వారిని స్మరించు కొనుట,17 న కవి సమ్మేళనాలు, సెమినార్లు,రచయితల సందేశాలు,18 న పాఠశాల విద్యార్థిని,విద్యార్థులకు చిత్ర లేఖనం,వ్యాసరచన,వక్తృత్వ, క్విజ్ మరియు క్రీడల పోటీలు,19 న మహిళలకు వివిధ కార్యక్రమములలో పోటీలు నిర్వహించుట రంగవల్లి,అల్లికలు,20 న అక్షరాస్యతా దినోత్సవం, చదవటం మాకిష్టం, వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు.

సాగునీరు లేకుండా వ్యవసాయాభివృద్ధి ఎలా

- రైతు గర్జన సభలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కెటిఆర్

గాయత్రి న్యూస్ నిర్మల్ :

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ళు కావస్తున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు కాలేదని కెటిఆర్ విమర్శించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో బుధవారం నిర్మల్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇన్చార్జి రామ్ కిషన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రైతు గర్జన సభలో కెటిఆర్ ప్రసం గించారు. రైతులకు రూ. 15వేల రైతు భరోసా ఇస్తామని చెప్పి ఎంతమం దికి ఇచ్చారని ప్రశ్నించారు. రైతుబంధు పేరును మార్చి రైతుభరోసాగా ప్రక టించినంత మాత్రాన రైతుల సమస్యలు పరిష్కారం కావని అన్నారు. రైతులకు పెట్టుబడి సాయం సకాలంలో అందించాలి, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి. ఎరువులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్ అందించిందని గుర్తుచేశారు. రైతు సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలను కొనసాగిం చడంతో పాటు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతులు ఎరువుల కోసం గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు.నిర్మల్ నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏమ య్యాయని బిజెపి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కెటిఆర్) ప్రశ్నిం చారు. నిర్మల్ పట్టణానికి అండర్‌గ్రౌండ్ అం డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని చెప్పిన హామీ ఏమైందని నిలదీశారు. గతంలో ఇదే అండర్గ్రౌండ్ డ్రైనేజీ కోసం రూ.150 కోట్లు కేటాయించాలని అప్పటి ముఖ్యమంత్రి కెసీఆర్కు లేఖ రాసిన మహేశ్వర్‌రెడ్డి, ఇప్పుడు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆ పనులను ఎందుకు ముందుకు తీసుకెళ్లడం లేదని ప్రశ్నించారు.గోదావరి జలాలు రైతులకు ఎందుకు అందడం లేదు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సాగునీటి సమస్యలపై కెటిఆర్ ప్రత్యేకంగా ప్రస్తావిం చారు. గోదావరి నది పక్కనే ప్రవహిస్తున్నా రైతుల పొలాలకు మాత్రం సాగునీరు అందని పరిస్థితి ఎందుకని ప్రశ్నించారు. గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అనేక ప్రణాళికలు రూపొందించిందని తెలిపారు. ఎస్సారెస్పీ పునర్జీవ పథకం ద్వారా నీటిని ఎత్తిపోసి ప్రాజెక్టును నింపడంతో పాటు సరస్వతి కాలువ, సదర్మట్, కడెం ప్రాజెక్టులకు సాగునీరు అందించాల్సిన అవ సరం ఉందన్నారు. రైతులకు సాగునీరు అందించకుండా వ్యవసాయాన్ని ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. ప్రాజెక్టులు, కాలువలు ఉన్నప్పటికీ చివరి ఆయకట్టు రైతులకు నీరు అందకపోవడం ఆందోళనకరమన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు.

మహిళలకు ఇచ్చిన హామీలు ఎక్కడ

మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, కల్యాణలక్ష్మి పథకంలో అదనంగా తులం బంగారం



వంటి హామీలను కాంగ్రెస్ ఎన్నికల సమ యంలో ప్రకటించిందని కేటీఆర్ గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలుపై ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదని ప్రశ్నిం చారు. మహిళలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రైతు గర్జన సభ ద్వారా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే తమ ఉద్దేశమని కేటీఆర్ పేర్కొన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతులు, మహిళలు, యువతకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సభలో నిర్మల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి రామ్ కిషన్ రెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, మాజీ మంత్రి జోగు రామన్న,మా జంపి బాల్క, బోత్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, వినయ్ రెడ్డి, జీవన్ రెడ్డి, డా, కిరణ్ కొమురెవర్ సమన్యాయ కర్త ముధోల్ పడకండి రమాదేవి సమన్యాయ కర్త ముధోల్ విలాస్ గాదేవర్ రావు, సుమన్, బీఆర్ఎస్ నాయ కులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

వాల్‌మార్ట్‌తో ఏపీ ఉత్పత్తుల ఎగుమతుల విస్తరణకు చర్చలు



విశాఖపట్నం, నవంబర్ 12 (గాయత్రి న్యూస్ ప్రతినిధి రామడుగు శివ కుమార్):

ఆంధ్రప్రదేశ్ నుంచి వాల్‌మార్ట్ సంస్థ ప్రతి ఏడాది దాదాపు 500 మిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను సేకరిస్తోందని, ఈ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. విశాఖపట్నంలో జరుగుతున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో వాల్‌మార్ట్ గ్లోబల్ గవర్నమెంట్ అఫైర్స్ అండ్ బిజినెస్ డిప్లమసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పాల్ డైక్‌తో సమావేశమై చర్చించారు. ఏపీలో నిర్వహించే ఎంఎస్ఎంఈ కార్యక్రమానికి వాల్‌మార్ట్ గ్లోబల్ బయ్యర్లను ఆహ్వానించి, సముద్ర ఉత్పత్తులు, వస్త్ర రంగాల్లో అవకాశాలను పరిశీలించాలని కోరారు. స్వయం ఏపీ, లేపాక్షి బ్రాండ్ల ద్వారా కళాకారులు, మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు వాల్‌మార్ట్, ఫ్లిప్‌కార్ట్ దేశీయ, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థల్లో ప్రత్యేక అవకాశాలు కల్పించాలని ప్రతిపాదించారు. ఈ దిశగా వాల్‌మార్ట్‌తో ప్రత్యేక కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

భూముల రీసర్వే పనులపై అదనపు కలెక్టర్ ఆరా

- గంగాపూర్‌లో క్షేత్రస్థాయి పరిశీలన
- వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



బజార్ హత్నూర, గాయత్రి:

మండలంలోని గంగాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే పనులను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాయి సిదాం చిత్రు గురువారం పరిశీలించారు. గ్రామంలో సర్వే బృందాలు నిర్వహిస్తున్న కొలతల ప్రక్రియను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రీసర్వే పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత రెవెన్యూ, సర్వే అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె. శ్యామ్ సుందర్, మండల సర్వేయర్ బాపురావు, మండల గిర్దావర్ రాథోడ్ నూర్ సింగ్, జీపీఓ అనసూయ, గ్రామ సర్పంచ్‌తో పాటు స్థానిక రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు

కార్తీక మాస వేడుకల్లో చిన్నారుల భరతనాట్య ప్రదర్శన కనువిందు

- మయూరి నృత్య భంగిమలతో అలరించిన బాల కళాకారులు.. భక్తులను మంత్రముగ్ధులను చేసిన ప్రదర్శన



శ్రీకాళహస్తి, నవంబర్ 12,గాయత్రి న్యూస్ :రిపోర్టర్ : రంజిత్

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శ్రీ జ్ఞానప్రసూనాంబికా సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానం కళా ప్రాంగణంలో చిన్నారుల భరతనాట్య ప్రదర్శన అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవతా గీతాలు, స్వామి అమ్మవార్ల కీర్తనలకు అనుగుణంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.సంప్రదాయ వస్త్రధారణ, అద్భుతమైన నృత్య భంగిమలు, మయూరి ఆకృతులను తలపించే అభినయాలతో బాల కళాకారులు తమ ప్రతిభను చాటుకున్నారు. చిన్నారుల హావభావాలు, లయబద్ధమైన నృత్య ప్రదర్శనకు భక్తులు, ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది.దేవస్థానం, ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు చిన్నారుల్లో దాగి ఉన్న కళాత్మక ప్రతిభను వెలికితీయడంతో పాటు భారతీయ సాంస్కృతిక సంప్రదాయాలను ప్రోత్సహించేందుకు దోహదపడుతున్నాయి. కార్తీక మాస ఆధ్యాత్మిక వాతావరణంలో చిన్నారుల నాట్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

నందికొట్కూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఫాతిమాబీకి జగన్ అభినందనలు





తాడేపల్లి, నవంబర్ 12 (గాయత్రి న్యూస్ ప్రతినిధి రామడుగు శివ కుమార్):

నందికొట్కూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన షేక్ ఫాతిమాబీ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కుటుంబ సభ్యులతో కలిసి పార్టీ కేంద్ర కార్యాలయంలో జగన్‌ను కలిసిన ఆమె, మున్సిపల్ ఎన్నికలు, కౌంటింగ్ సందర్భంగా ఎదురైన పరిణామాలను వివరించారు. ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన ఫాతిమాబీని జగన్ అభినందించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, డాక్టర్ సుధీర్, ఫాతిమాబీ భర్త, పార్టీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్ అహ్మద్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ గఫార్ పాల్గొన్నారు.

పునరుత్పాదక విద్యుత్ రంగంలో పెట్టుబడులపై ఆరా



విశాఖపట్నం, నవంబర్ 12 (గాయత్రి న్యూస్ ప్రతినిధి రామడుగు శివకుమార్):

విశాఖపట్నంలో జరుగుతున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా పలువురు మంత్రులు, శాసనసభ్యులు, ఉన్నతాధికారులను కలిశాను. ఈ సందర్భంగా విద్యుత్ శాఖకు సంబంధించి ముఖ్యంగా పునరుత్పాదక విద్యుత్ రంగంలో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, వివిధ ప్రాజెక్టుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నాను. రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన రంగ అభివృద్ధి, విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెంపునకు సంబంధించిన అంశాలపై చర్చించడం జరిగింది.

విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు కేంద్ర మంత్రులకు స్వాగతం





విశాఖపట్నం, నవంబర్ 12 (గాయత్రి న్యూస్ ప్రతినిధి రామడుగు శివకుమార్):

విశాఖపట్నంలో నిర్వహిస్తున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు విచ్చేసిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడులకు ఘనంగా స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారితో పాటు పలువురు ప్రముఖులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే పెట్టుబడులకు అత్యంత ప్రాధాన్యత కలిగిన గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యానికి కేంద్ర మంత్రుల రాక మరింత ప్రోత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు.

మార్కాపురం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జెడ్పీ చైర్మన్ కందుల రామిరెడ్డి

మార్కాపురం, నవంబర్ 12(గాయత్రి న్యూస్ ప్రతినిధి రామడుగు శివకుమార్):

మార్కాపురం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన జెడ్పీ చైర్మన్ కందుల రామిరెడ్డి.

ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యలు, మార్కాపురం జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించే అంశాలపై చర్చించినట్లు తెలిసింది.



ఏలేశ్వరం ప్రజల తీర్పును తారుమారు చేశారు.. సీసీ ఫుటేజ్ బయటపెట్టాలి-బదిరెడ్డి గోవింద్

- ఆర్డీవో, జేసీలతో శివాలయం వద్ద ప్రమాణానికి సిద్ధమా టీడీపీ నేతలకు సవాల్
- నూతన చైర్మన్ యార్లగడ్డ అక్షితకు ఆశాలత శుభాకాంక్షలు..
- వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని హితవు
- శిడగం వెంకటేశ్వరరావు, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, కోరాడ ప్రసాద్ టీడీపీ నేతల వ్యాఖ్యలకు కౌంటర్



గాయత్రి న్యూస్

ఏలేశ్వరం మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం రాజకీయ వివాదం మరింత ముదురుతోంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. గతంలో టీడీపీ నాయకులు నిర్వహించిన మీడియా సమావేశానికి కౌంటర్‌గా వైసీపీ చైర్మన్ అభ్యర్థి బదిరెడ్డి ఆశాలత గోవింద్ ఆధ్వర్యంలో గురువారం మరోసారి ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుల వ్యాఖ్యలను వైసీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు.

వ్యక్తిగత విమర్శలపై ఆశాలత అభ్యంతరం

బదిరెడ్డి గోవింద్ నివాసం వద్ద నూతన కౌన్సిలర్లు, పట్టణ ముఖ్య నాయకులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆశాలత మాట్లాడుతూ, తాను, తన భర్త ప్రేమించి వివాహం చేసుకున్న విషయం అందరికీ తెలిసిందేనని, రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత జీవితంపై విమర్శలు చేయడం తగదని అన్నారు. అటువంటి వ్యాఖ్యలు చేస్తున్న నాయకులు మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ఏలేశ్వరం మున్సిపాలిటీ నూతన చైర్మన్ యార్లగడ్డ అక్షితకు శుభాకాంక్షలు తెలిపి, ప్రజలు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గతంలో కౌన్సిలర్‌గా, అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా పనిచేసిన అనుభవం తనకు ఉందని, ప్రజాతీర్పు తమకు అనుకూలంగా ఉన్నప్పటికీ అధికారుల అండతో ఫలితాలను తారుమారు చేశారని ఆరోపించారు.

కౌంటింగ్ అక్రమాలపై వైసీపీ నేతల ఆరోపణలు

వైసీపీ పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రజాస్వామ్యబద్ధంగా జరగలేదని, అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఫలితాలను తారుమారు చేశారని ఆరోపించారు. 17వ వార్డు కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ తన ప్రత్యర్థి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రూ.50 వేలు ఇస్తే నామినేషన్ ఉపసంహరించుకుంటాడని కొందరు తన వద్దకు వచ్చి చెప్పారని పేర్కొన్నారు. స్వామి మాల ధరించి ఉన్నందున ఈ వ్యవహారంపై ఇంతకంటే ఎక్కువగా మాట్లాడదలుచుకోలేదన్నారు. 20వ వార్డు కౌన్సిలర్ సుంకర రాంబాబు మాట్లాడుతూ వార్డుల విభజన సమయంలోనే అక్రమాలు జరిగాయని, కొన్ని వార్డుల్లో ఓటర్ల సంఖ్య 400 దాటకుండా అధికారులను ఉపయోగించుకున్నారని ఆరోపించారు. 15వ వార్డు కౌన్సిలర్ కోరాడ రామలక్ష్మి ప్రసాద్ మాట్లాడుతూ తప్పుడు ఆరోపణలను ప్రజలు నమ్మబోరని, ప్రజలు తమ వెంటే ఉన్నారని అన్నారు.

సీసీ ఫుటేజ్ బహిర్గతం చేయాలి.. బదిరెడ్డి గోవింద్ సవాల్

వైసీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి బదిరెడ్డి గోవింద్ మాట్లాడుతూ కౌంటింగ్ సమయంలో అధికార బలాన్ని ఉపయోగించి ఆర్డీవో, జేసీ, పోలీసుల సహకారంతో ప్రజాతీర్పును తారుమారు చేశారని ఆరోపించారు. 11 ఓట్ల అంశాన్ని ఆధారంగా చేసుకుని తమపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అధికారంలో ఉన్నవారికి చిత్తశుద్ధి ఉంటే కౌంటింగ్‌కు సంబంధించిన సీసీ ఫుటేజ్‌ను ప్రజల ముందు బహిరంగంగా ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. తాము చేసిన వ్యాఖ్యల్లో తప్పు ఉందని నిరూపిస్తే సగం గుండు చేయించుకుని నెల రోజులపాటు ఏలేశ్వరంలో తిరుగుతానని సవాల్ విసిరారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరగలేదని నిరూపించాలంటే పెద్దాపురం ఆర్డీవో, జేసీలను ఏలేశ్వరం శివాలయం వద్దకు తీసుకువచ్చి ప్రమాణం చేయించాలని వ్యాఖ్యానించారు. సుమారు వారం రోజుల తర్వాత టీడీపీ నాయకులు నిర్వహించిన ప్రెస్‌మీట్ రాజకీయ నాటకంలో భాగమని విమర్శించారు. 2029 ఎన్నికల్లో ప్రజలు తగిన సమాధానం చెబుతారని అన్నారు. ఎవరో ఒకరిద్దరూ వల్ల ఏలేశ్వరం మున్సిపాలిటీ ప్రజలను గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్ అని అనడం సరికాదన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం ఏలేశ్వరంలో వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి. కౌంటింగ్ అక్రమాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలు, సీసీ ఫుటేజ్ బహిరంగ ప్రదర్శన డిమాండ్‌పై అధికారుల స్పందన ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.ఈ కార్యక్రమంలో పైల విజయ్,దత్తి రాజా,వాగు బలరాం,బూర్ల సత్తిబాబు,భజంతుల లక్ష్మణరావు, ధనేడి చిన్నా, రాచర్ల రమేష్, భీశెట్టి రాజా తదితరులు పాల్గొన్నారు.

ఎల్.బి.ఆర్.సి.ఈ. ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగంలో అధ్యాపకునికి పీహెచ్‌డీ ప్రదానం

గాయత్రి న్యూస్

స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలోని ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఇంటూరి దక్షిణామూర్తి కి, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం కాకినాడ మెకానికల్ విభాగంలో ఎక్స్పెరిమెంటల్ స్టడీస్ ఆన్ సింగిల్ ఎక్స్‌పాన్షన్ ర్యాంప్ నాజిల్ అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రదానం చేశారు. ఈ పరిశోధన ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ పి. లోవరాజు మరియు జె.యన్ .టి.యు రిటైర్డ్ ప్రొఫెసర్ వి.రామచంద్ర రాజు పర్యవేక్షణలో జరిగింది. ఈ పరిశోధనలో సూపర్‌సోనిక్ ప్రవాహాల లక్షణాలు, నాజిల్ పనితీరు, పీడన పంపిణీ, షాక్ వేవ్ నిర్మాణాలు మరియు ద్వితీయ ద్రవ ఇంజెక్షన్ ప్రభావాలను ప్రయోగాత్మకంగా, విశ్లేషించారు. ఈ పరిశోధన సూపర్‌సోనిక్ ప్రవాహాలపై శాస్త్రీయ అవగాహనను పెంపొందించడంతో పాటు, ఏరోస్పేస్ రంగంలో మరింత సమర్థవంతమైన ప్రొపల్షన్ వ్యవస్థల రూపకల్పనకు విలువైన మార్గదర్శకత్వం అందిస్తుంది. సంప్రదాయ యాంత్రిక భాగాల అవసరం లేకుండా ద్వితీయ ద్రవ ఇంజెక్షన్ ద్వారా జెట్ దిశను నియంత్రించే అవకాశాలను పరిశీలించడం ఈ పరిశోధనలో ప్రధాన ప్రత్యేకత. ఈ అధ్యయన ఫలితాలు భవిష్యత్తులో విమానాలు, అంతరిక్ష వాహనాలు మరియు అధునాతన ఏరోస్పేస్ ప్రొపల్షన్ వ్యవస్థల్లో సమర్థవంతమైన, సరళమైన థ్రస్ట్ వెక్టర్ నియంత్రణ సాంకేతికతల అభివృద్ధికి ఉపయోగపడనున్నాయి. దీనితోపాటుగా ప్రొఫెసర్ పి. లోవరాజు మరియు ప్రొఫెసర్ వి. రామచంద్ర రాజు పర్యవేక్షణలో, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం కాకినాడ మెకానికల్ విభాగంలో “ఫ్లో ఫీల్డ్ క్యారెక్టరిస్టిక్స్ ఓవర్ ఫార్వర్డ్ అండ్ బ్యాక్‌వర్డ్ ఫేసింగ్ స్టెప్ కాన్ఫిగరేషన్స్ ఆన్ బ్లఫ్ బాడీస్” అనే అంశంపై చేసిన పరిశోధనకు, జె .న .టి .యూ



కాకినాడలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న వి. మని కుమార్ కి కూడా పీహెచ్‌డీ ప్రదానం చేసారని ప్రొఫెసర్ పి. లోవరాజు తెలియజేసారు.ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ పి. లోవరాజు, అధ్యాపక సిబ్బంది మరియు విద్యార్థులు డా. ఇంటూరి దక్షిణామూర్తికి అభినందనలు తెలిపారు.(డా. కె. అప్పారావు) ప్రిన్సిపాల్

పార్టీ మాటే శిరోధారంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ మాటే నా బాటగా ప్రయాణం సాగిస్తాను

గాయత్రి న్యూస్



అందరికి ధన్యవాదాలు రాత్రి నుండి నాకు ఫోను ద్వారా మెసేజ్లు ద్వారా మాట్లాడిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు.పార్టీ మాటే శిరోధారంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ మాటే నా బాటగా ప్రయాణం సాగిస్తాను.స్థానిక ఎన్నికలలో అవకాశం కల్పించిన సురనేని నివృతరావుకి శుభాకాంక్షలు.ఈ రోజు నుండి యధావిధిగా వారి గెలుపు కోసం కృషి చేస్తూ కష్టపడతానని, రానున్న రోజుల్లో ఇంకా మంచి స్థాయికి చేరుకునేలా,ఎవ్వరు అధైర్య పడవద్దు మునుపటి వలె మీ కష్ట కాలంలో మీకు తోడుగా ఉంటానని,నన్ను ఆదరించి అభిమానించే వారందరికీ తోడుగా ఉంటానని, ఇప్పటివరకు నాకు తోడుగా ఉంటూ నన్ను ఆదరించి అభిమానించిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసుకుంటూ లంక లితీష్
మైలవరం తెలుగు యువత అధ్యక్షులు
మైలవరం నియోజకవర్గం

మైలవరం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా జమీందారులు సూరనేని నివృత్తు రావుని ప్రకటించిన

- ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్

గాయత్రి న్యూస్

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా మైలవరం గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా అఖండ మెజార్టీతో గెలిపించాలని కూటమి నేతలకు, గ్రామ ప్రజలకు సూచించిన ఎమ్మెల్యే వసంత సర్పంచి అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే తెలుసుకున్న మైలవరం గ్రామంలోని వివిధ కుల పెద్దలు, గ్రామస్తులు, వివిధ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో చేరుకొని నివృత్ రావు కి శుభాకాంక్షలు అభినందనలు తెలియజేసి వారి సంఘీభావాన్ని వ్యక్తం చేశారు సర్పంచి అభ్యర్థి నిర్ణయం పట్ల హర్షశీ వ్యక్తం చేస్తున్న మైలవరం గ్రామ ప్రజలు.ప్రశాంత వాతావరణంలో మైలవరం ప్రజలు మైలవరం పట్టణ అభివృద్ధే ధ్యేయంగా అహర్నిశలు సేవలందించినున్న సర్పంచ్ అభ్యర్థి నివృత్ రావు



ఎన్నికల అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన వ్యాసరచన,క్విజ్ పోటీలు

గాయత్రి న్యూస్



మైలవరం, ఎన్టీఆర్ జిల్లా డా.లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైలవరంలోరాజకీయ శాస్త్ర విభాగం అధ్యాపకురాలు షేక్ జాహిదా బేగం ఆధ్వర్యంలో,ఎన్నికల అక్షరాస్యత క్లబ్ ద్వారా విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు వివిధ పోటీలు నిర్వహించారుఈ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛమైన ఓటర్ల జాబితా ప్రాముఖ్యత అనే అంశంపై వ్యాసరచన పోటీతో పాటు ఎన్నికల ప్రక్రియ అంశంపై క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ పోటీల ద్వారా ఓటరు నమోదు, ఓటర్ల జాబితా ప్రాముఖ్యత, ఎన్నికల విధానం, ఓటు హక్కు వినియోగం,ప్రజాస్వామ్య విలువల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారుప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి పౌరుడి భాగస్వామ్యం ఎంతో అవసరమని, స్వేచ్ఛాయుతమైన మరియు నిష్పక్షపాతమైన ఎన్నికలు జరగడానికి స్వచ్ఛమైన ఓటర్ల జాబితా కీలకమని ఈ సందర్భంగా వివరించారు. యువతలో ఓటు హక్కుపై బాధ్యత, ఎన్నికల పట్ల ఆసక్తి, ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.మాధవి మాట్లాడుతూ,విద్యార్థులు ఇటువంటి అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ప్రజాస్వామ్య విలువలను తెలుసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సయ్యద్ అబూబకర్ షహర్యార్, ఐక్యూఏసీ సమన్వయకర్త డా.ఎస్.కె.కరీముల్లా,ఇతర అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినారు

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూని మర్యాదపూర్వకంగా కలిసిన కే.గోపాలపురం ఎంపీటీసీ వేమగిరి నూకరాజు!



గాయత్రి న్యూస్

స్థానిక రావులమ్మ నగర్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం జగ్గంపేట శాసనసభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ ని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు గండేపల్లి మండలం, కే.గోపాలపురం ఎంపీటీసీ సభ్యులు వేమగిరి నూకరాజు.ఈ సందర్భంగా ఎంపీటీసీ వేమగిరి నూకరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆశీస్సులతో, స్వర్గీయ అవసరాల బాలసుబ్రహ్మణ్యం తనయుడు శ్రీనివాస్ నాయకత్వంలో కే.గోపాలపురం గ్రామంలో అఖండ మెజార్టీతో టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థిగా విజయం సాధించాను.ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి, ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తాను” అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కె గోపాలపురం తెలుగుదేశం జనసేన కూటమి నాయకులు పాల్గొన్నారు.

GAYATHRI NEWS Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao, SUJATHA NAGAR, BHADRADRI KOTHAGUDEM, TELANGANA - 507120 PRGI Reg No - TGTEL/26/A3993 ..
Cell No - 7386045673 ..... Printed ESHAGNA SERVICE INDIA PRIVATE LIMITED
SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.